# కడప-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

మంగళవారం 12 జూన్ 2026

## రైతు సేవా కేంద్రాలకు చేరి వేరుశెనగవిత్తనాలు



**పీలేరు, జూన్ 11 ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్ కు ప్రభుత్వ రాయితీతో పంపిణీ చేయనున్న వేరుశెనగ విత్తనాలు రైతు సేవా కేంద్రాలకు చేరినట్లు ఇన్చార్జి ఏడీఏ కరుణాకర్ రెడ్డి తెలిపారు. గురువారం వేరుశెనగ విత్తనాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలానికి కే6 రకం, నారాయణి రకం వేరుశెనగ విత్తనాలు 800 క్వింటాళ్లు చొప్పున మొత్తం 1600 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. కేవీపల్లె మండలానికి నారాయణి రకం 2700 క్వింటాళ్లు వచ్చినట్లు తెలిపారు. విత్తనకాయలు కావల్సిన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాలలో తమ పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని త్వరలో విత్తనాలు పంపిణీకి సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ రాయితీ 40 శాతం పోనూ 30 కిలోల బ్యాగ్ కే6 రకం రూ. 1836. నారాయణి రకం రూ.1890తో పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. విత్తనకాయలు కావల్సిన రైతులు ఆధార్కార్డు. భూమి పాస్పుస్తకం. మొబైల్ నెంబరుతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఇప్పటి వరు 120 క్వింటాళ్లకు మాత్రమే రిజి స్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రమాదేవి, రైతులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతి సంక్షేమ విజయోత్సవ సభకు భారీగా తరలిరండి

### మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపు



**రాయచోటి, జూన్ 11 ప్రభాతవార్త :** నిర్వహించనున్న సంక్షేమ విజయోత్సవ సభకు రాయచోటి నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పిలుపునిచ్చినట్లు మంత్రి కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. వారు ఈ సందర్భంగా రేపు అనగా శుక్రవారం రోజు ఉదయం 6 గంటలకు సంబేపల్లి టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా ప్రతి ఒక్కరూ హాజరుకావలెనని తెలిపారు. అక్కడికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి చేరుకుని పార్టీ శ్రేణులతో కలిసి భారీ ర్యాలీగా తిరుపతికి బయలుదేరనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

# అక్రమ మద్యం, గంజా పై ఉక్కుపాదం మోపాలి

### బెల్ట్ షాపుల నియంత్రణలో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలి

### రాష్ట్ర గనులు, భూగర్భ మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లురవీంద్ర





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి హాజరైన అధికారులు

**మదనపల్లి, జూన్ 11: ప్రభాతవార్త** అక్రమ మద్యం, గంజాపై ఉక్కుపాదం మోపాలని రాష్ట్ర గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం మదనపల్లి కలెక్టర్ కార్యాలయం పిజిఆర్ఎస్ హాలులో మంత్రి అన్నమయ్య, చిత్తూరు తిరుపతి ఉమ్మడి జిల్లాల ప్రొహిబిషన్,ఎక్సైజ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఎస్పీ ధీరజ్ కునుబిల్లి, శాసనసభ్యులు షాజహాన్ భాష పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మద్యం విధానాన్ని క్రమబద్ధీకరించి దేశంలోనే ఆదర్శవంతమైన విధానంగా తీర్చిదిద్దామని తెలిపారు. గతంలో నెలకొన్న గందరగోళ పరిస్థితులను అధిగమించి, ప్రస్తుతం ఇతర రాష్ట్రాల అధికారులు సైతం ఆంధ్రప్రదేశ్ మద్యం విధానాన్ని అధ్యయనం చేసే స్థాయికి తీసుకువచ్చామని పేర్కొన్నారు. రాబోయే సెప్టెంబర్ నెలతో ప్రస్తుత మద్యం విధానం గడువు ముగియనున్న నేపథ్యంలో కొత్త విధాన రూపకల్పనపై ఇప్పటికే అధికారుల బృందం కసరత్తు ప్రారంభించిందని తెలిపారు. దీనికి సంబంధించి అధికారులు తమ సూచనలు, అభిప్రాయాలను అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం కేవలం ఆదాయ వృద్ధి మాత్రమే కాదని, ప్రజల ఆరోగ్య పరిరక్షణ కూడా ముఖ్యమని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నాణ్యతలేని మద్యం కారణంగా అనేక ప్రాణనష్టాలు సంభవించాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఏపీఎంఎస్ వ్యవస్థ ద్వారా వినియోగదారులకు అన్ని బ్రాండ్లు అందుబాటులో ఉంచడంతో పాటు నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. సరిహద్దు జిల్లాల్లో మద్యం విక్రయాలు గణనీయంగా పెరిగినట్లు పేర్కొంటూ, వినియోగదారులు నాణ్యమైన ఉత్పత్తులను ఎంపిక చేసుకునే అవకాశాలు కల్పించామని తెలిపారు. అదే సమయంలో మద్యపాన నియంత్రణ, ప్రజారోగ్య పరిరక్షణ లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. మద్యం దుకాణాల నిర్వహణ సమయాలు, బెల్ట్ షాపుల నియంత్రణ వంటి అంశాల్లో అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టకు భంగం కలిగించే సంఘటనలను నివారించేందుకు పోలీసు శాఖతో సమన్వయంగా పనిచేయాలని సూచించారు. ములకలచెరువు, ఇబ్రహీంపట్నం తదితర ప్రాంతాల్లో జరిగిన సంఘటనల అనంతరం ప్రభుత్వం వెంటనే స్పందించి సురక్ష యాప్ వంటి చర్యలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న నవోదయ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో అధికారులు చురుకైన పాత్ర పోషించాలని కోరారు. పునరావృతంగా నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి అవసరమైతే పీడీ చట్టం కింద చర్యలు తీసుకోవడంతో పాటు, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించే పునరావాస కార్యక్రమాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వానికి, ఎక్సైజ్ శాఖకు మంచి పేరు తీసుకురావడానికి అధికారులు సమిష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ మరియు ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఆకాంక్షించారు. పొరుగు రాష్ట్రాల్లో గతంలో ఎదురైన ఆదాయ నష్టాలను సమర్థవంతమైన చర్యల ద్వారా గణనీయంగా తగ్గించగలిగామని సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మద్యం విక్రయాల నిర్వహణలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, వినియోగదారుల ఆరోగ్య పరిరక్షణతో పాటు ప్రభుత్వ ఆదాయాన్ని కాపాడేందుకు అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని బార్‌లు, మద్యం దుకాణాల్లో నకిలీ లేదా కల్తీ మద్యం విక్రయాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. దుకాణాలు, బార్‌ల నుంచి తరచూ నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని, బార్‌లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు విక్రయ కౌంటర్లను స్పష్టంగా చిత్రీకరిస్తున్నాయో లేదో నిర్ధారించాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎలాంటి కల్తీ కార్యకలాపాలు జరగకుండా అధికారులు కటుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా కొన్ని బ్రాండ్ల విక్రయాల్లో అసాధారణ పెరుగుదల కనిపిస్తే వెంటనే అప్రమత్తమై తనిఖీలు నిర్వహించాలన్నారు. ఇదే విధంగా అధికారులు క్రమశిక్షణతో పనిచేసి ప్రభుత్వ ఆదాయాన్ని రక్షించడంతో పాటు వినియోగదారుల ఆరోగ్యాన్ని కూడా కాపాడాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గత ఆరు నెలలుగా మద్యం సేవించిన అనంతరం సంభవించే మరణాలపై కొందరు వ్యక్తులు, కొన్ని మీడియా వేదికలు, సామాజిక మాధ్యమాల్లో వాస్తవ నిర్ధారణ లేకుండానే కల్తీ మద్యం కారణమని ప్రచారం చేయడం వల్ల ప్రభుత్వ ప్రతిష్టకు నష్టం కలుగుతున్నదని తెలిపారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్న వెంటనే ఎక్సైజ్, పోలీసు మరియు జిల్లా యంత్రాంగం సమన్వయంతో వాస్తవాలను నిర్ధారించి ప్రజలకు సరైన సమాచారాన్ని అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అలాగే ఇటీవల గంజాయి నియంత్రణ చర్యలు కఠినతరం అయినప్పటికీ, కొందరు యువకులు బార్లు, అనుమతి గదుల్లో అధికంగా మద్యం సేవించి పరస్పరం ఘర్షణలకు దిగుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయని, వీటిపై ప్రత్యేకంగా దృష్టి సారించి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇటువంటి సంఘటనల దర్యాప్తులో సీసీ కెమెరాల దృశ్యాలు కీలక ఆధారాలుగా ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని మద్యం దుకాణాలు, బార్లు, అనుమతి గదుల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిరంతరం పని చేసే స్థితిలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎక్సైజ్, పోలీసు మరియు జిల్లా పరిపాలనా శాఖల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసి, అక్రమ మద్యం నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ,ప్రభుత్వ ప్రతిష్టను కాపాడేందుకు సంయుక్తంగా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో మదనపల్లి శాసనసభ్యులు షాజహాన్ భాష మాట్లాడుతూ గత ప్రభుత్వం నాణ్యత లేని, ప్రమాణాలు పాటించని ఉత్పత్తుల విక్రయాల వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితులు ఉండేవని, అయితే ప్రస్తుతం ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నాణ్యమైన బ్రాండ్లను అందుబాటులోకి తీసుకువచ్చి తీసుకువచ్చిందని అన్నారు. మద్యం దుకాణాల పరిసర ప్రాంతాల్లో నివసించే మహిళలు, కుటుంబాలు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. దుకాణాల వద్ద గుంపులుగా చేరి, కూర్చొని మద్యం సేవించే పరిస్థితులు లేకుండా పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. ప్రజల మనోభావాలకు భంగం కలగకుండా చర్యలు తీసుకోవడం ద్వారా మరింత మెరుగైన పరిపాలన సాధించవచ్చు అని అన్నారు. అదేవిధంగా, బెల్ట్ షాపుల నిర్వహణను పూర్తిగా అరికట్టేందుకు ఎక్సైజ్ శాఖ అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బయట నుంచి అక్రమంగా మద్యం సరఫరా జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సందర్భంగా రామసముద్రంకు చెందిన ఎక్సైజ్ శాఖ ఉద్యోగిబిరెడ్డయ్య, అనారోగ్యంతో విధి నిర్వహణలో మరణించినందున ఉద్యోగి కుటుంబానికి శాఖ ఉద్యోగుల సంఘం ద్వారా రూ.5 లక్షలు చెక్కు అందజేశారు. ప్రభుత్వ తరఫున మరో రూ.5 లక్షలు మంజూరు చేస్తామని, అలాగే ఆయన భార్యకు కారుణ్య నియామకం కింద త్వరలోనే ఉద్యోగం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అన్నమయ్య, చిత్తూరు తిరుపతి ఉమ్మడి జిల్లాల ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారులు, మైన్స్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో చెరువుల పనులను

# వేగవంతం చేయండి

### కలెక్టర్ నిశాంత్‌కుమార్



చెరువుల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

**మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :** జిల్లాలో సోర్స్ కనెక్టివిటి, చెరువుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు సోర్స్ కనెక్టివిటి కల్పించడం, నీటి వనరుల పునరుద్ధరణ, చెరువుల అనుసంధానం, చెరువుల పనులపై ఇరిగేషన్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ నియమించిన వాసర్ ల్యాబ్స్ నిపుణులు సమర్పించిన నివేధికలు, మ్యాప్‌ల ఆధారంగా జిల్లాలో భవిష్యత్తు కార్యచరణను రూపొందించడంపై విస్తృతంగా చర్చించారు. ఇందులో భాగంగా చెరువుల కనెక్టివిటి అవకాశాలను మ్యాప్‌ల ద్వారా ఇరిగేషన్ అధికారులకు కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా సోమల, కలికిరి, పెద్దమండ్యం ఇతర మండలాల్లో మైనర్ ఇరిగేషన్ ట్యాంకులకు సమీప జలవనరుల ద్వారా అనుసంధానం కల్పించ గల ప్రాంతాలను గుర్తించారు. జిల్లాలో బ్రీచ్ అయిన చెరువులు, నీటివనరులను పునరుద్ధరించేందుకు చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చించారు. అందుబాటులో ఉన్న వివిధ నిదుల ద్వారా అత్యవసర పనులకు ఆమోదం తెలుపుతూ పనులను త్వరిగతగతిగా ప్రారంభించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడంతో పాటు వ్యవసాయానికి స్థిరమైన నీటి వనరులు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ సురేష్‌బాబు, రిటైర్డు సూపరిండెంట్ వెంకటరామయ్య, అధికారులు పాల్గొన్నారు.

### పులివెందులలో వచ్చే ఎన్నికల్లో

# టీడీపీ జెండా ఎగరవేస్తాం

### బైక్ ర్యాలీ విజయోత్సవంలో టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి

**పులివెందుల, జూన్ 11, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఘనవిజయం సాధించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా పులివెందుల పట్టణంలో భారీ బైక్ ర్యాలీని నిర్వహించారు. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీలో టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా సాగిన ర్యాలీ అనంతరం పూలంగల్ల సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభలో పలువురు నాయకులు కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు.

**మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ విజయం ఖాయం: మాజీ పట్టణ అధ్యక్షులు వెంకటరామిరెడ్డి**

గత ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినట్లు చెప్పుకున్నప్పటికీ మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. పట్టణంలో అనేక అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీని ఓడించి పులివెందులలో టీడీపీ జెండా ఎగరవేయడం ఖాయమని మాజీ పట్టణ అధ్యక్షులు మద్దూరు వెంకటరామిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.హామీల అమలులో కూటమి ప్రభుత్వం ముందంజ: రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి..పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదే నన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం ముందంజలో ఉందని తెలిపారు. డీఎస్సీ నిర్వహణ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అర్హులకు ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. అలాగే పోలవరం ప్రాజెక్టును 2027 నాటికి పూర్తి చేసి, ఆదర్శవంతమైన రాజధాని నిర్మాణంతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ...మిగతా 2వ పేజీలో

## కూలీకెళ్లి.. కాటికి పయనమయ్యారు

### ఆటోను ఢీకొన్న సుమో

### ఒకరు మృతి, ఇద్దరి పరిస్థితి విషమం, పలువురికి గాయాలు





ప్రమాద దృశ్యం, మృతి చెందిన మమత

**కలికిరి, జూన్ 11, ప్రభాతవార్త:** కాయా కష్టం కోసం పనికి వెళ్లారు. ఉదయం నుంచి బతుకు దెరువు కోసం శ్రమించి ఇంటికి తిరిగి ప్రయాణమయ్యారు. కొద్ది నిమిషాలలో ఇంటికి చేరుకుంటామని అనుకున్న ఆ శ్రమ జీవులకు సుమో రూపంలో వచ్చిన మృత్యువు ఒకరిని బలిగొంది. మరికొందరికి బలమైన రక్తగాయాలు తగిలి మృత్యువుతో పోరాడుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. అన్నమయ్య జిల్లా చిన్నమండెం మండలం కాయలవారిపల్లికి చెందిన కూలీలు సోమలమండలం ఇరికిపెంట రైతుకు చెందిన టమోటా పొలంలో పని చేసేందుకు ఆటోలో 14 మంది బయలుదేరి వెళ్లారు. అక్కడ పని పూర్తి చేసుకొని ఇంటికి తిరిగి వస్తుండగా కలికిరి-కలకడ రోడ్డు మార్గంలోని గజ్జలవారిపల్లి సమీపాన ఎదురుగా వచ్చిన సుమో డ్రైవర్ అతి వేగంగా వచ్చి ఆటోను ఢీకొన్నాడు. దీంతో ఆటోలో బోల్తా పడడం, ఆటోలో ఉన్న రామక్క(60), కాంతమ్మకు(55), రమణమ్మ (65), సంపూర్ణ(40), ఆటో డ్రైవర్ రెడ్డిశేఖర్(35), వి.సుజాత(32), సుగుణ (45), కె.మమత(30), కె.లక్ష్మీదేవి(60), ఆర్.అక్కయ్య(60), డి.సుజాత(44) లకు బలమైన రక్తగాయాలు తగిలాయి. సమాచారం తెలుసుకున్న కలికిరి సీఐ అనిల్‌కుమార్ కానిస్టేబుళ్లు కె.విజయకుమార్, ఎల్.రాజా, హోంగార్డులు రామాంజులు, రఫీ, నిజాముద్దీన్‌లు ఏమాత్రం వెనకా ముందు ఆలోచించకుండా ప్రజల సహకారంతో ఆటోను పైకి లేపి ఆటోలో ఇరుకున్న క్షతగ్రాతులను బయటికి తీసి ఆటోలో కొందరు, మరికొందరిని అంబులెన్స్‌లో కలికిరి ఆసుపత్రికి తరలించారు. వైద్యాధికారి ఉదయకిరణ్, ఆసుపత్రి సిబ్బంది క్షతగాత్రులకు చికిత్సలు అందిస్తుండగా మమత(35) అనే మహిళ మృతి చెందింది. రెడ్డిశేఖర్, సంపూర్ణల పరిస్థితి విషమించడంతో పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఆసుపత్రిలో వైద్యాధికారి, సిబ్బంది చికిత్సలు అందిస్తున్నారు. సీఐ అనిల్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి ఘటనపై వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**సకాలంలో స్పందించిన పోలీసులు - పలువురికి తప్పిన ప్రాణాపాయం**

కలికిరి-కలకడ రోడ్డు మార్గంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సకాలంలో పలువురికి రక్తగాయాలు అయ్యాయి. సమాచారం తెలుసుకున్న సీఐ అనిల్‌కుమార్, ...మిగతా 2వ పేజీలో

### సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

## అందజేసిన సాయిలోకేష్

**రాజంపేట, జూన్ 11 ప్రభాతవార్త** భారతీయ జనతా పార్టీ రాజంపేట కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయి లోకేష్ పార్టీ నాయకులతో కలిసి అందజేశారు. రాజంపేట పట్టణం మన్నూరు నివాసి నారదాసు అశ్వినికి 25574 రూపాయలు, పెనగలు మండలం వెలగచేర్ల గ్రామంకు చెందిన అబ్బిగారి వెంకట సుబ్బమ్మకి 40,644, ఓబులవారిపల్లె మండలం సుబ్బరాజుకి 98,893 రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన మొత్తాన్ని అందించారు.ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు అత్యవసర వైద్య చికిత్స కోసం ఆర్థిక సహాయం అందించడం వల్ల పేద కుటుంబాలు అప్పుల భారంలో కూరుకుపోకుండా ఆర్థిక భరోసా కలిగిస్తూ ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పెంచుతూ సామాజిక భద్రతకు అండగా నిలుస్తున్న పథకమని సాయి లోకేష్ పేర్కొన్నారు. ముఖ్య మంత్రి సహాయ నిధి కింద వారికి సహాయం అందించిన రాజమండ్రి ఎంపీ పురంధేశ్వరికీ, రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణ యాదవ్, జిల్లా కార్యదర్శి నరేంద్ర రాజు, తోట రామయ్య, శ్రీనివాసులు, మణి, రమణ, సుందర్, నవీన్, లక్ష్మి నారాయణ, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న బాధితులతో బిజెపి నేతలు

## ఓటర్ల అవగాహన కార్యక్రమం

### పాల్గొన్న డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి



**బద్వేలు అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త** నియోజకవర్గంలోని అట్లూరు మండలం వేములూరు గ్రామంలో నిర్వహించిన సర్ ఓటర్ల అవగాహన కార్యక్రమంలో ఉమ్మడి కడప డీసీసీ బ్యాంక్ చైర్మన్, బద్వేలు నియోజకవర్గ నాయకులు మంచూరు సూర్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త ఓటర్ల నమోదు, ఓటరు జాబితాలో పేర్ల సవరణలు, చిరునామా మార్పులు వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్ల హక్కుల పరిరక్షణలో బూత్ లెవెల్ ఏజెంట్ల పాత్ర కీలకమని పేర్కొన్న ఆయన, మ్యాపింగ్ మరియు ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు చోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రతి ఇంటికి వెళ్లి అర్హులైన ఓటర్లను గుర్తించి నమోదు చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, దానిని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన అన్నారు. మండలంలో కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశం పార్టీ నాయకులు డాక్టర్ ఓబుళాపురం రాజశేఖర్, చెరుకూరి రవికుమార్, పోతిరెడ్డి రెడ్డయ్య, కాలవపల్లె వీరారెడ్డి, అట్లూరు మండల నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## దొంగ అరెస్ట్

### - రూ.50వేలు నగదు స్వాధీనం



**ప్రొద్దుటూరు క్రైం, జూన్ 11, ప్రభాతవార్త:** ఇంటి నిర్మాణ పరికరాల దొంగను గురువారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు ముద్దాయి షేక్ అబ్దుల్ సుభహాన్ మట్టిమసీదు వీధిలోని మహబూబ్ బాషా ఇంట్లో గత 20 రోజుల నుంచి ఎవరూ లేని సమయంలో ఇంటి బీగాలు పగలగొట్టి పడక గదిలోని బీరువాలో ఉన్న రూ.50వేలు నగదు దొంగతనం చేసినందుకు షేక్ మహబూబ్ బాషాను గురువారం మధ్యాహ్నం ఆర్టీపీపీ క్రాస్ రోడ్డు, ఎర్రగుంట్ల సర్కిల్ నందు అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

## ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


శిబిరానికి హాజరైన రోగులు

చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త
మండల కేంద్రమైన చౌడేపల్లిలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పట్టణంలోని సంతగేటు వద్దగల సచివాలయం సమీపంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, తిరుపతికి చెందిన శ్రీ వెంకటేశ్వరా అరవింద ఆసుపత్రి వారిచే సంయుక్తంగా నిర్వహించిన శిబిరంలో దాదాపు 150 మంది కంటి సమస్యలతో పరీక్షలు చేయించుకొన్నారనీ, వారిలో 21మంది శస్త్ర చికిత్సకు ఎంపికయినట్లు పంచాయతీ కార్యదర్శి శివకుమార్ తెలిపారు. ఆపరేషన్‌కు ఎంపికయిన వారికి ఉచిత రవాణా, భోజన వసతి కల్పించి శస్త్రచికిత్స చేస్తున్నట్లు ఆయన వివరించారు. అరవింద ఆసుపత్రి కంటి వైద్య నిపుణులు, కళ్ళ సమస్యలతో బాధపడుతున్న రోగులు పాల్గొన్నారు.

## షిర్డీబాబా ఆలయంలలో గురువారం పూజలు



చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త
స్థానిక షిర్డీసాయిబాబా ఆలయంలో గురువారం పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పృధ్వీనవీన్ ఆధ్వర్యంలో అభిషేకం, అలంకరణ చేసారు. కాగడా పూజలతో స్వామివారి ఆలయం దద్దరిల్లింది. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదాలందించారు.

## వైష్ణవీమాతకు ఏకాదశి పూజలు



చౌడేపల్లి, జూన్ 11 ప్రభాతవార్త
మండలంలోని పుదిపట్లలో గల వైష్ణవీమాతకు ఏకాదశి పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం, అలంకరణ నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించారు. ఆలయ నిర్మాణదాత వినోద్‌కుమార్‌రెడ్డి భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## మంత్రికి ఘనస్వాగతం పలికిన చినబాబు



మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :
గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్రను తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు ఘనస్వాగతం పలికారు. మంత్రి గురువారం మదనపల్లె కలెక్టరేట్‌లో జరిగిన అధికారుల సమీక్ష సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రికి తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులతో పాటు రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి పఠాన్‌ఖాదర్‌ఖాన్, ఆర్టీసి యూనియన్ గౌరవ అధ్యక్షులు నాగూరువల్లి, నాయకులు దొరస్వామినాయుడు, సీడ్ మల్లికార్జుననాయుడు, మహబూబ్‌ఖాన్, ప్రభుగౌడ్‌లు స్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్చం అందజేసి శాలువతో ఘనంగా స్వాగతించారు.

## భూకబ్జాను అడ్డుకొన్న సిపిఎం నాయకులు

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త:
మదనపల్లె రూరల్ మండలంలోని కోళ్ళబైలు గ్రామం సర్వేనెంబర్ 529లో జరుగుతున్న భూకబ్జాను సిపిఎం నాయకులు గురువారం అడ్డుకొన్నారు. ఈసందర్బంగా సిపిఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన మదనపల్లె పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ భూములకు విలువ పెరగడంతో కబ్జాదారులు ప్రభుత్వ భూములను యదేచ్ఛంగా కబ్జాచేసి లేవుట్లుగా వేసి ప్లాట్లు విక్రయాలు చేయడం జరుగుతోందన్నారు. భూకబ్జాలపై పట్టించుకునే నాధుడే కరువయ్యారన్నారు. మండలంలోని బికెపల్లి, కోళ్ళబైలు, బసినికొండ గ్రామాల్లో జరుగుతున్న భూ ఆక్రమణలను రెవెన్యూ అధికారులు అడ్డుకోవాలన్నారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు క్రిష్ణమూర్తి, నాగరాజు, మౌళాలి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని ఘనస్వాగతం పలికిన ఎమ్మెల్యే



మదనపల్లె, జున్ 11 ప్రభాతవార్త:
మదనపల్లె పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర భూగర్భ గనుల, ఎక్సైజ్ శాఖామంత్రి కొల్లు రవీంద్ర గురువారం ఎమ్మెల్యే నివాసానికి విచ్చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఘనస్వాగతం పలికారు. మంత్రికి పుష్పగుచ్చం అందజేసి శాలువతో సత్కరించారు. అనంతరం నియోజకవర్గంకు చెందిన టిడిపి నాయకులను ఎమ్మెల్యే మంత్రికి పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తనయుడు జునైద్ అక్బర్, నాయకులు జేసిబి వేణు,సుదర్శన్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్లు పులి మహాలక్ష్మి, రాధ, మహిళా నాయకురాలు నాగవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మంత్రితో కలసి వలసపల్లె వద్ద ఉన్న క్వారీని సందర్శించారు. అనంతరం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

## అంగన్వాడి సహాయ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

గాలివీడు. జూన్11. ప్రభాతవార్త:
మండలంలో ఖాళీగా ఉన్న అంగన్వాడి సహాయకురాలి పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ సిడిపిఓ జహ్రాబి పేర్కొన్నారు. మండలంలోని అలుగుంటివారిపల్లి, గుడిసిలోపల్లి బక్కి రెడ్డి గారి పల్లి, బోయపల్లి, పెద్దపల్లి, లలో అంగనవాడి సహాయకురాల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వీటికి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 21 సంవత్సరాలనుంచి 35 సంవత్సరాల మధ్యలో వయసు కలిగి ఉండాలని స్థానికంగా వివాహం అయి ఉండాలని పదవ తరగతి పాసై ఉండాలని తెలిపారు. ఈనెల 12 నుంచి 22వ తేదీ లోపల దరఖాస్తులను లకిరెడ్డిపల్లి ఐసిడిఎస్ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

## సర్వమత సామరస్యంతో పీలేరు అభివృద్ధే లక్ష్యం



పీలేరు జూన్ 11 ప్రభాతవార్త:
సర్వమత సామరస్యంతో పీలేరును అభివృద్ధి పరచడానికి లక్ష్యంగా పెట్టుకుని కృషి చేసినట్లు తాజా మాజీ సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష తెలిపారు. బుధవారం పీలేరు పట్టణంలోని మసీదులు, మదరసాల పెద్దలు, ముత్తవల్లీలతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు పట్టణంలోని దేవాలయాలు, మసీదులు, మదరసాలు, చర్చిలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధికి సంబంధించి ఈ ఏడాది మార్చి 28న జరిగిన గ్రామపంచాయతీ సాధారణ సమావేశంలో ప్రవేశపెట్టిన అజెండాకు అధికారిక తీర్మానాల ద్వారా అనుమతులు మంజూరైన విషయాన్ని హబీబ్ బాష వివరించారు. అనంతరం సంబంధిత తీర్మానాల ప్రతులను బుధవారం ఆయన మసీదులు, మదరసా ప్రతినిధులకు అందజేశారు. మతపరమైన విద్యా సంస్థలు, ప్రార్థనా మందిరాల అభివృద్ధికి గ్రామపంచాయతీ స్థాయిలో అధికారిక తీర్మానాలు చేసి సహకారం అందించడం దేశంలోనే అరుదైన నిర్ణయమని, ఈ కార్యక్రమం చారిత్రాత్మకమని సమావేశంలో పాల్గొన్న పెద్దలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పీలేరు ప్రజల శ్రేయస్సు, శాంతి, సౌభ్రాతృత్వం, ఐక్యత కోసం అందరూ కలిసి ప్రత్యేక దువా (ప్రార్థన) నిర్వహించారు. ఈ సందర్భంగా మసీదు, మదరసాల పెద్దలు డాక్టర్ షేక్ హబీబ్ బాషను ఘనంగా సన్మానించి, పీలేరు అభివృద్ధి కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ప్రజా సంక్షేమం, సామాజిక సామరస్యం, మత సంస్థల అభివృద్ధికి ఆయన తీసుకున్న చర్యలు ఆదర్శప్రాయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ముత్తవల్లీలు అల్లావుద్దీన్, మస్తాన్, ఇబ్రహీం, రెహమాన్, నజీర్, ఖాజా, చాను, తమీం, రియాజ్, మహబూబ్ బాషా, యాసీన్, కాలేష, మసీదులు, మదరసాలకు చెందిన పెద్దలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# ఎట్టికేలకు ఎగ్జిట్ ఎంట్రీలకు అరంగేట్రం

### జాతీయ రహదారిపై మొదలైన పనులు ఫలించిన చింతల మిథున్ హామీలు



కేంద్ర మంత్రి తో మాట్లాడుతున్న ఎంపీ మిథున్ రెడ్డి, నేషనల్ హైవే నుంచి కలికిరి పట్టణంలోనికి ప్రారంభమైన రహదారి పనులు

పీలేరు జూన్ 11 ప్రభాతవార్త:
నియోజకవర్గంలోని కలికిరి పట్టణంలోనికి నేషనల్ హైవే నుంచి పట్టణంలోనికి రహదారి పనులు ప్రారంభమయ్యాయి ఈ సందర్భంగా వైకాపా నాయకులు మాట్లాడుతూ పీలేరు మాజీ శాసనసభ్యులు ఎన్నో దపాలుగా శాసనసభ్యులుగా పార్టీ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో ప్రజలతో ఉన్న అవినాభావ సంబంధాలతో తిరుపతి మదనపల్లి నేషనల్ హైవే రోడ్డు బాధితులు కలికిరి మండల ప్రజలు విన్నపాలతో స్పందించిన చింతల కలికిరి మార్గంలో పట్టణంలోకి వెళ్లాలంటే నేషనల్ హైవే రోడ్డులు స్థలం కేటాయించక పోవడంతో గట్టిగా పట్టు పట్టడమే కాకుండా పలుమార్లు ఎంపీ మిథున్ రెడ్డికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఎన్నో దపాలు ప్రతిపాదనలు చేసి పీలేరు నియోజకవర్గంలోని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కలికిరి పట్టణంలోకి ప్రవేశించడానికి నేషనల్ హైవేలో రోడ్డు సౌకర్యం కల్పించాలని పలుమార్లు రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డికి మొరపెట్టడం ప్రతిపాదించడం ప్రజల మనోభావాలు తీర్చడం కోసం నిరంతరం కృషి పట్టుదలతో ప్రయత్నం చేయడంతో పట్టువదలని విక్రమార్కుడిలా పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి ఢిల్లీలో తన పరపతిని ఉపయోగించి పార్లమెంటు సభ్యుని హోదాలో పలుమార్లు పలు శాఖల మంత్రులకు విన్నపాలు సమర్పించడం ముఖ్యంగా రోడ్ల శాఖ మంత్రి పలుమార్లు ప్రజల గురించి చర్చించడం నేషనల్ హైవే రోడ్డులో కలికిరి పట్టణంలోకి రోడ్డు మార్గం మంజూరు చేయించడంలో సఫలీకృతులైయ్యారు. ఎట్టికేలకు రోడ్డు పనులు ప్రారంభించడం మొదలవడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఎంపీ మిథున్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే చింతలకు కృతజ్ఞతలు తెలియజేయడంలో ఏమాత్రం సందేహపడ లేదు ,ఏది ఏమైనాప్పటికీ ప్రజల మనోభావాలను గుర్తించి వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి సఫలీకృతలగుడముతో ఎంపీ మిథున్ రెడ్డికే సాధ్యమని పలువురు అభినందిస్తున్నారు.
పట్టుకుంటే వదలను అనే సామెత మిథున్ రెడ్డికే దక్కుతుంది వైయస్సార్‌ఎస్‌యు రాష్ట్ర అధికార ప్రతినిధి సుంకర చక్రధర్ అన్నారు.



ఏ పనినైనా సాధించాలంటే పట్టువదలని విక్రమార్కుడిలా ప్రజల కోసం నిత్యం పనిచేసే మనస్తత్వం కలిగిన నాయకుడు రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్ రెడ్డి అని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ స్టూడెంట్ ఫెడరేషన్ యూనియన్ లీడర్ చక్రధర్ అన్నారు.



ప్రజల మనోభావాలకు అనుగుణంగా అనునిత్యం కృషి పట్టుదలతో పని చేసే ఏకైక వ్యక్తి రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి అని అటువంటి వారితో పని చేయడం పూర్వజన్మ సుకృతం అని ఆయన కృషి పట్టుదల వల్లే చింతల ప్రతిపాదనల వల్లే కలికిరి మార్గంలో నేషనల్ హైవే రోడ్డును కలికిరి పట్టణంలోకి వాహనాలు వెళ్లేందుకు మార్గం సుగమం చేయటంలో మిథున్ రెడ్డి సఫలీ కృతమై ప్రజల మన సును గెలుచుకున్న వ్యక్తిని రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి వడ్డే హరి అన్నారు.



కుల మత భేదాలకు అతీతంగా నమ్ముకున్న వారికి న్యాయం చేసే ఏకైక వ్యక్తి రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి అని కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా పేద ప్రజలకు న్యాయం చేసి ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు పార్టీలో వ్యక్తిగతంగా స్థానం కల్పించే వ్యక్తి మిథున్ రెడ్డిని ఆయన చూడబోతూనే కలికిరి పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేరిందని కలికిరి వైకాపా పట్టణ అధ్యక్షులు హనీఫ్ అన్నారు.

# విజయోత్సవ సభను జయప్రదం చేయండి

### టీడీపీ పీలేరు నియోజకవర్గం పరిశీలకులు ఎం. సుబ్బయ్య


సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

పీలేరు,జూన్ 11, ప్రభాతవార్త:
కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం పురస్కరించుకుని తెలుగు దేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తిరుపతి నగరం దామినీడు లో శుక్రవారం తలపెట్టిన వార్షికోత్సవ విజయోత్సవ సభను జయప్రదం చేయాలని ట్రైబల్ అడ్వైజర్ కమిటీ మెంబర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ పరిశీలకులు ఎం.సుబ్బయ్య పిలుపునిచ్చారు. పీలేరు నియోజకవర్గ శాసనసభ్యులు నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు కలికిరి టీడీపీ కార్యాలయం నల్లారి అమరనాథరెడ్డి భవన్ లో పీలేరు నియోజకవర్గంలోని ఆరు మండలాల అధ్యక్షులు, కలికిరి మండల అధ్యక్షులు ఎస్. కే షాబుద్దీన్, గుర్రంకొండ మండల అధ్యక్షులు నాయిని జగదీష్, కేవీకే పల్లి మండల అధ్యక్షురాలు గీతాంజలి, కలకడ మండల అధ్యక్షులు ప్రభాకర్ నాయుడు, వాల్మీకిపురం మండల అధ్యక్షులు దామోదర్ రెడ్డి, పీలేరు మండల అధ్యక్షులు శ్రీ కాంత్ రెడ్డి తో గురువారం సమావేశం నిర్వహించారు. పీలేరు నియోజకవర్గం నుండి విజయోత్సవ సభకు 120 వాహనాలు సిద్ధం చేసినట్లు నేతలు ఆయనకు తెలిపారు. కలికిరి మండలం నుండి 25 వాహనాలు, గుర్రంకొండ మండలం నుండి 20, కలకడ మండలం నుండి 20, పీలేరు మండలం నుంచి 20, వాల్మీకిపురం మండలం నుంచి 20, కేవీకే పల్లి నుండి 15 వాహనాలు, మండల కేంద్రాల నుండి విజయోత్సవ సభకు బయలుదేరెందుకు సిద్ధం చేసినట్లు వివరించారు టిడిపి కార్యకర్తలు నాయకులు ప్రజలు ఉదయం 6 గంటలకు మండల కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జ్ రమేష్ బాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సనావుల్లా, యూనిట్ ఇన్చార్జ్ అస్లాం, మాజీ సర్పంచ్ కే. వెంకటరమణారెడ్డి, అల్లాబక్షు, విజయారెడ్డి, బూత్ కన్వీనర్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

## కూలీకెళ్లి.. కాటికి పయనమయ్యారు

మొదటి పేజీ తరువాయి



హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుళ్లు విజయకుమార్, రాజా, రాజు, హోంగార్డులు రఫీ, నిజాముద్దీన్, రామాంజులు సకాలంలో స్పందించి క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించడంతో పలువురు మృత్యువు నుంచి బయట పడ్డారు. దీంతో స్థానికులు పోలీసులను అభినందించారు.

## స్వచ్ఛపథం ద్వారా అవగాహన కార్యక్రమం

కలికిరి, జూన్ 11, ప్రభాతవార్త:
స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సంద్రవారిపల్లి గ్రామ పంచాయతీ మరియు పత్తేగడ పంచాయతీ పరిధిలోని కొటాల గ్రామంలో ఇంటింటి చెత్త సేకరణ, తడి పొడి చెత్త వేరు చేయడం, గ్రామ పరిశుభ్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఐవీఆర్ఎస్ కాల్స్ ద్వారా ప్రజల్లో పరిశుభ్రతపై చైతన్యం పొందించడం ఇంటింటి చెత్త సేకరణకు సహకరించడం, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పరిశుభ్రమైన పరిసరాలను కాపాడుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. గ్రామ ప్రజలు పరిశుభ్రమైన ఆరోగ్యకరమైన వాతావరణం కోసం ఇంటింటిచెత్త సేకరణ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా డిప్యూటీ మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారి విజ్ఞప్తి చేయడం జరిగింది.

## కందికుంట ప్రసాద్‌కు ఘనంగా సన్మానం



రాయచోటి జూన్ 11 ప్రభాతవార్త
కూటమి ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా తిరుపతి నందు ఉదయం 10 గంటలకు జరుగుతున్న బహిరంగ సభకు రాయచోటి మీదుగా వెళుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్‌కు అన్నమయ్య జిల్లా రాయచోటి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో రాయచోటి నియోజకవర్గం ద్వారా భారీ ఎత్తున తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు కుటుంబ సభ్యులు బయలుదేరుతున్నారని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు గాజుల ఖాదర్బాషా తెలిపారు. ఏర్పాట్ల పరిశీలనకు ముఖ్యఅతిథిగా కదిరి శాసనసభ్యులు కందికుంట ప్రసాద్ సమీక్షించి ఏర్పాట్లు పూర్తి చేసినందుకు వెళ్తున్న ఆయనకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో తెలుగుదేశం పార్టీ నాయకులు మండల అధ్యక్షులు క్లస్టర్ ఇంచార్జీలు బూత్ ఇన్చార్జీలు మహిళా నాయకురాళ్ల తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఎన్టీఆర్ కాలనీలో నీటి సమస్యపై స్పందించిన గండికోట సుధాకర్

### ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా



రాయచోటి, జూన్ 11 ప్రభాతవార్త
అన్నమయ్య జిల్లా రాయచోటి సమీపంలోని సిబ్యాల గ్రామం మోడల్ స్కూల్ ఎదురుగా ఉన్న ఎన్టీఆర్ కాలనీలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొనడంతో బోర్లు ఎండిపోవడంతో గత కొన్ని రోజులుగా ప్రజలు, ముఖ్యంగా మహిళలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.స్థానికుల సమస్య తెలుసుకున్న వెంటనే రాయచోటి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గండికోట సుధాకర్ ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా తాగునీటిని సరఫరా చేసి ప్రజల నీటి అవసరాలను తీర్చారు. ఈ సందర్భంగా గండికోట సుధాకర్ మాట్లాడుతూ:ఎన్టీఆర్ కాలనీలో తాగునీటి సమస్య ఉందని తెలిసిన వెంటనే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశాల మేరకు ట్యాంకర్ల ద్వారా తాత్కాలికంగా నీటి సరఫరా ఏర్పాటు చేశాం అన్నారు. బోర్లు ఎండిపోవడంతో మహిళలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజలకు తాగునీరు అందించడం మా బాధ్యతగా భావిస్తున్నాంఅన్నారు రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల సహకారంతో త్వరలోనే శాశ్వత నీటి బోర్లు ఏర్పాటు చేసి కాలనీలో నీటి సమస్యకు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపిస్తాం అన్నారు. అదేవిధంగా కాలనీ అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్లు, మురుగు కాలువలు, స్ట్రీట్ లైట్లు వంటి మౌలిక వసతుల కల్పనకు కూడా చర్యలు తీసుకుంటాం అన్నారు. ప్రజలకు ఎప్పుడైనా అవసరం వచ్చినప్పుడు టీడీపీ నాయకులు ముందుండి సేవలందిస్తారన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## టీడీపీ జెండా ఎగరవేస్తాం

మొదటి పేజీ తరువాయి



రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి పేర్కొన్నారు.

**డబుల్ ఇంజన్ ప్రభుత్వంతో రాష్ట్రం అభివృద్ధి బాటలో: భాజపా రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశిభూషణ్ రెడ్డి**

దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన స్థానిక సంస్థల నిధులను పక్కదారి పట్టించి వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం మళ్లీ స్థానిక సంస్థలను బలోపేతం చేస్తూ అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యం

### హార్సిలీహిల్స్‌ను ప్లాస్టిక్ రహితంగా తీర్చుదాం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్


యోగా చేస్తున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :
యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం సాధ్యమంటూ జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. గురువారం పర్యాటక కేంద్రమైన హార్సిలీహిల్స్‌లో యోగా సాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప జీవన విధానం అన్నారు. యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయన్నారు. ప్రతి ఒక్కరూ రోజువారి జీవితంలో కొంత సమయాన్ని యోగాకు కేటాయించాలని సూచించారు. విద్యార్థులు, యువత,మహిళలు, వృద్దులు యోగాను అలవాటు చేసుకోవాలన్నారు. ఈనెల 14న పర్యాటక ప్రాంతమైన బోయకొండలో 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న కార్యక్రమంలో పాల్గొనాలని పలుపునిచ్చారు. అనంతరం హార్సిలీహిల్స్‌లో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నిషేదంపై అవగాహన, ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం కలిగే దుష్‌పరిణామాలు, ప్రజలు పాటించాల్సిన సూచనలు, చేయకూడనివి ప్రదర్శనలో వివరించారు. అనంతరం పర్యాటకుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఆర్ఓ తాగునీటి ప్లాంట్‌ను కలెక్టర్ ప్రారంభించారు. హార్సిలీహిల్స్ వంటి ప్రకృతి సౌందర్య ప్రాంతాలను కాలుష్య రహితంగా కాపాడుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చంద్రశేఖర్‌రెడ్డి, కాలుష్య మండలి ఇంజనీర్ సుధా కురబ, జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగభూషణం, డిఈఓ సుబ్రమణ్యం, డిపిఓ రాధమ్మ, ఆర్డీఓ పీడి నాగేశ్వర్‌రావు డిడిఓ లక్ష్మీపతి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## శాశ్వత ప్రభుత్వ మద్యం గౌడాన్ నిర్మించాలని ఎక్సైజ్‌శాఖా మంత్రికి వినతి


మంత్రికి విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, జూన్ 11 ప్రభాతవార్త :
ప్రభుత్వ మద్యం గోడౌన్‌కు శాశ్వత భవనం నిర్మించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో గురువారం మదనపల్లె కలెక్టరేట్‌కు వచ్చిన ఎక్సైజ్‌శాఖా మంత్రి కొల్లు రవీంద్రకు విన్నవించారు. ఈ సందర్భంగా సాంబశివ మాట్లాడుతూ ప్రైవేటు గోడౌన్ నిర్వహణ అత్యంత అధ్వాన్నంగా ఉందని దీని వల్ల హామాలీలకు దుమ్ము, దూళి కారణంగా డస్ట్ అలర్జీ, శ్వాసకోససమస్యలు ఏర్పడుతున్నాయన్నారు. రోజూ కష్టపడి పనిచేసే హామీలకు కనీసం తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చుపెడుతున్న మద్యంషాపులో పనిచేస్తున్న హామాలీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం భాదాకరమన్నారు. హామాలీల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని శాశ్వత మద్యం గోడౌన్‌ను నిర్మించాలన్నారు. హామాలీలకు ఆరోగ్య భద్రత సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో హామాలీలు నరేష్, సుబ్రమణ్యం, నరసింహా, బాలాజినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నల్ల గంగమ్మ ఆలయం హుండీ లెక్కింపు



సంబేపల్లి మార్చి 11 ప్రభాతవార్త
సంబేపల్లి దేవరాయి ఆలయ ఉండి గురువారం లెక్కించినట్లు ఆలయ చైర్మన్ కూనాసి సుబ్బరాజు యాదవ్ తెలిపారు 6.4.2026 నుండి 11.6.2026 వరకు. ఆలయ హుండీ ద్వారా 2,96,573 రూపాయలు వచ్చినట్లు తెలియజేశారు హుండీ లెక్కింపు దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శివయ్య ఈవో దేవదాసు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించినట్లు తెలిపారు ప్రతినిత్యం అమ్మవారి మహిమలతో భక్తులను ఆకట్టుకుంటున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో ఆలయ బోర్డు నంబర్లు వెంకటరమణ అంచల రఘు భాస్కర్ స్థానిక పోలీసులు బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 90వేల లీటర్ల ట్యాంక్ నిర్మాణానికి స్థలపరిశీలన



తంబళ్లపల్లె జూన్ 11 ప్రభాతవార్త :
తంబళ్లపల్లె నియోజకవర్గ కేంద్రంలో జల జీవన్ మిషన్ లో 90 వేల లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంక్ మంజూరు అయింది. గురువారం ఆర్డబ్ల్యూఎస్ ఏఈఈ వినోద్ కుమార్, జల్జీవన్ మిషన్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ సంజయ్, బోర్ మెకానిక్ మాధవరెడ్డి ,టిడిపి నాయకుడు నరసింహులు ట్యాంకు నిర్మాణానికి స్థల పరిశీలన చేశారు. తంబళ్లపల్లె నూతన సచివాలయం సమీపంలోని పాత ట్యాంకు స్థానంలోనే కొత్త ట్యాంకు నిర్మాణం జరిగితే తంబళ్లపల్లె నియోజకవర్గం వర్గానికి తాగునీటి సరఫరా సులువుగా ఉంటుందని ఏఈఈ వినోద్ కుమార్ ధృవీకరించారు. స్థాయి ఎంపిక తర్వాత యుద్ధ ప్రాతిపదిక వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపడతామని విలేకరులకు తెలిపారు.

మల్లయ్య కొండల మహాశివుడు అందరికీ ఆరాధ్య దైవం
కొండల మైనింగ్ పై లక్షలాది భక్తుల మనోభావాలకు గౌరవం ఇవ్వాలి
తంబళ్లపల్లె జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్.

తంబళ్లపల్లె జూన్ 11 ప్రభాతవార్త ః
తంబళ్లపల్లె కు సమీపంలోని మల్లయ్య కొండల(సాదుకొండ, ఇనుముకొండ, మల్లయ్య కొండ) సంచరించిన ముక్కంటి గా శతాబ్దాల క్రితమే మహా శివుడు నెలవై నేటికీ ఈ ప్రాంత ప్రజలందరికీ పిలిస్తే పలికే ఆరాధ్య దైవంగా కొలువు తీరాడు.ఇలాంటి లక్షలాది శివభక్తుల మనోభావాలను ప్రభుత్వాలు పరిగణలోకి తీసుకొని ముందుకు వెళ్లాల్సి ఉంటుందని ఈ సున్నితమైన సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్ దృష్టికి తీసుకెళ్లి మైనింగ్ చర్యలను ఆపడానికి శివ భక్తుల సహకారంతో తన వంతు కృషి చేస్తానని తంబళ్లపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ పోతుల సాయినాథ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లయ్య కొండలపై 2000 సంవత్సరం నుండి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మైనింగ్ వ్యవహారాన్ని తెరపైకి తెచ్చి అప్పటి ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి మృతితో మరుగున పడిందని అనంతరం కిరణ్ కుమార్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అప్పటి భూగర్భ గనుల శాఖ మంత్రి అరుణ కుమారి మైనింగ్ చేయడానికి ప్రయత్నించగా తంబళ్లపల్లె ప్రాంత శివ భక్తులు,ప్రజలు, పార్టీలకతీతంగా ప్రజా ప్రతినిధులు వ్యతిరేక లక్ష సంతకాల ఉద్యమాలు చేపట్టగా ప్రభుత్వం దిగివచ్చి ఐదు శాఖలతో విచారణ కమిటీ వేసినట్లు చెప్పారు. ఆ కమిటీ సభ్యులు సాదుకొండ, ఇనుము కొండ, మల్లయ్య కొండల్లో సుదీర్ఘంగా క్షేత్రస్థాయిలో పర్యటించి ఆ మల్లయ్య కొండ మహాశివుడు సాదుకొండ వీరన్న గెవి నుండి ఇనుము కొండ మీదుగా మల్లయ్య కొండల్లో స్థిరపడిన శతాబ్దాల చరిత్ర ఆనవాళ్లు ప్రత్యక్షంగా చూసి కమిటీ సభ్యులు మహాశివుని మహిమలను గుర్తించి కొండల జోలికి వెళ్లరాదని ఇచ్చిన సమగ్ర నివేదికతో కనువిప్పు కలిగి మైనింగ్ చర్యలు పై ప్రభుత్వం తప్పుకున్నట్లు చెప్పారు. నాటి నుండి నేటి వరకు తంబళ్లపల్లె నియోజకవర్గం తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన లక్షలాదిమంది మహా శివుని భక్తులు ఆయన సేవకు విరాళాలు ప్రకటించి మల్లయ్య కొండలు దినదినాభివృద్ధికి కృషి చేస్తున్నారని అలాంటి మహోన్నిత కొండలను మైనింగ్ చేపడితే దైవత్వంతో పాటు పచ్చటి పర్యావరణం, లక్షలాది జీవరాసులు, వన్యప్రాణులు, ఆశ్రయం కోల్పోయి మానవ మనుగడ కష్టతరమవుతుందని మల్లయ్య కొండల్లో మైనింగ్ పై ఈ ప్రాంత చిన్న పిల్లవాడిని కదిలించిన తీవ్ర వ్యతిరేకత వస్తుందని లక్షలాది భక్తుల మనోభావాలకు అనుగుణంగా దేవునిపై రాజకీయాలు చేయకుండా మల్లయ్య కొండ శివుడు మన అందరి ఆరాధ్య దైవంగా మల్లయ్య కొండల్లో మైనింగ్ సమస్య పరిష్కారానికి శివ భక్తులు, ప్రజల మనోభావాలను కూటమి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి

# ఆర్ఎంపిలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి : డాక్టర్ రంగలక్ష్మి

సిద్ధవటం జూన్ 11 ప్రభాతవార్త

సిద్ధవటం మండలం పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సిద్ధవటం నందు వైద్యాధికారిణి పి రంగలక్ష్మి ఆధ్వర్యంలో ఆర్.ఎం.పి క్లినిక్లను సందర్శించి వైద్యం అందించే ఆర్ఎంపి అందరూ ప్రజలకు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూదులు మందులు సెలైన్ బాటిళ్లు ఆక్సిజన్ ఆపరేషన్లు అబార్షన్లు అలాంటి వైద్యం చేయకూడదని అలాచేయడం చట్టరీత్యా నేరమని గాయపడిన వారికి కట్లు మాత్రమే కట్టాలని ఆరోగ్య సలహాలు ఇవ్వాలని ఇలాంటివి చేసే దానికి మీకు అర్హత లేదని ఆర్ఎంపీలకు చెప్పడమైనది అనంతరం క్షయవ్యాధి గ్రస్తు రాలిని పరామర్శించడం జరిగినది ఆమెకు గుండె జబ్బు ఇతర అనారోగ్య సమస్యలు ఉండడం వల్ల మెరుగైన వైద్యం కోసం రిమ్స్ కు వెళ్ళమని చెప్పడం జరిగినది సరైన సమయంలో వైద్యం తీసుకుంటే జబ్బు నయమవుతుందని వారి కుటుంబ సభ్యులకు చెప్పడం జరిగినది తరువాత ఎస్సీ బాలికల వసతిగృహాన్ని సందర్శించి అక్కడి సిబ్బందికి వసతి గృహ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీళ్ల ట్యాంకులు శుభ్రంగా కడుకోవాలని పిల్లలకు ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే మా వైద్య సిబ్బందికి తెలియజేయాలని మేము పిల్లలకు వసతి గృహ సిబ్బందికి ఉచితంగా వైద్యం అందిస్తామని చెప్పడం జరిగినది ఈ కార్యక్రమంలో భాగంగా మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు దోమల వలన కలిగే జబ్బుల గురించి మరియు బేటీ పడావో బేటీ బచావో చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే కలిగే సమస్యలు అనారోగ్య సమస్యలు గురించి గ్రామంలోని ప్రజలకు చెప్పడం జరిగినది ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ సూపర్వైజర్ మోలాలి ఏఎన్ఎం శారద హెల్త్ అసిస్టెంట్ వెంకటసుబ్బయ్య అంగన్వాడీ టీచర్ సరోజమ్మ ఎస్సీ హాస్టల్ వంటమనిషి సరస్వతి ఆశ ఓబులమ్మ పాల్గొన్నారు.



# హుండీ లెక్కింపుతో రూ. 1.47 లక్షల ఆదాయం

పీలేరు, జూన్ 11 ప్రభాతవార్త:

స్థానిక ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని శ్రీశ్రీశ్రీఅంకాలమ్మ ఆలయం హుండీ లెక్కింపు ద్వారా రూ. 1.47,160 ఆదాయం వచ్చినట్లు దేవాదాయశాఖ ఈవో మంజుల తెలిపారు. గురువారం ఆలయం హుండీ లెక్కింపు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ. 1.47.160 నగదు, 4 గ్రాముల బంగారు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తనిఖీ అధికారి ఎస్. శశికుమార్, ఆలయ చైర్మన్ కె. రామకృష్ణారెడ్డి, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.



హుండీ లెక్కింపు చేపడుతున్న దృశ్యం

# మెడికల్ కార్మికులు 16న ఛలో విజయవాడ

మైదుకూరు, జూన్ 11, ప్రభాతవార్త:

ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న శానిటేషన్ సెక్యూరిటీ మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ మరియు వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జూన్ 16న తేదీన చలో విజయవాడ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బాదుల్లా ఏరియా కార్యదర్శి శివరామ్ లు తెలిపారు. మైదుకూరు పట్టణంలో ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వద్ద ప్రచారం నిర్వహించి కరపత్రాలు విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆసుపత్రుల్లో పనిచేసే శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులకు 5నెలలు బకాయి పడ్డ జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జిఓ నెం 138 ప్రకారం వేతనాలు ఏజెన్సీ నిర్వహికులు ఎంవోయూ నియమ నిబంధనలతో పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కలిపి 18,600 రూపాయలు ఇవ్వాల్సి ఉండగా చాలా తక్కువ వేతనం ఇస్తూ కార్మికులు శ్రమను దోచుకుంటున్నారని వారి జీవితాలుతో ఏజెన్సీ కాంట్రాక్టర్లు అధికారులు తమజోబులు నింపుకుంటున్నారన్నారు. ఏ ప్రభుత్వ రంగ సంస్థలోనైనా కాంట్రాక్ట్ ,ఔట్సోర్సింగ్ కార్మికులను 60 సంవత్సరాల వరకు కొనసాగిస్తుంటే విచిత్రంగా వింతగా మెడికల్ రంగంలో మాత్రమే కాంట్రాక్టర్లకు మేలు చేస్తూ కార్మికులను 50 సంవత్సరాలకే ఇంటికి పంపడం అనేది సరైనది కాదన్నారు, ఈ విషయంపై అనేకమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయిన ఫలితం లేకుండా పోయిందన్నారు, కార్మికులను అడ్డగోలుగా తొలగించిన అధికారులు, ప్రభుత్వం కాంట్రాక్టర్కు వత్తాసు పలకడం కార్మిక వ్యతిరేక చర్య అని దుయ్యబట్టారు. నియమ నిబంధనలు పాటించాలని అడిగిన కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తూ ప్రశ్నించిన వారిని తొలగిస్తామన్నారు, గత కొన్ని సంవత్సరాల నుండి ఈపీఎఫ్,ఈఎస్ఐ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదన్నారు, కార్మికుల సమస్యలు చర్చల రూపంలో వెంటనే పరిష్కారం చేయాలని ఈ నెల 16న చలో విజయవాడ కార్యకమాన్ని చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు షావల్లి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ప్రైవేట్ హాస్పిటల్ తనిఖీ

సుండుపల్లె, జూన్ 11, ప్రభాతవార్త:



రాయవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని రాయవరం టౌన్ నందు ఉన్న ప్రభాకర క్లినిక్ను జిల్లా వైద్యాధికారి ఆదేశాల ప్రకారం డాక్టర్ కె. శేఖర్ రెడ్డి తనిఖీ చేసారు. ఆయన మాట్లాడుతూ క్లినిక్ నందు ప్రథమ శికిత్స మాత్రమే చేయాలని, తీవ్ర అనారోగ్యం తో బాధ పడే వాళ్ళను ఉన్నత చికిత్స కొరకు ఉన్నత హాస్పిటల్ కు పంపాలని చెప్పారు. ఏదైనా గ్రామాలలో ఎక్కువ అనారోగ్య సమస్యలు ఉంటే మా దృష్టికి. తీసుకొని రావలనని చెప్పారు ఈ ప్రోగ్రాం నందు ఏంపిహెచ్ఇఓ వీర నారాయణ ఎఎన్ఎం అనిత ఆశా నాగ రాణ పాల్గొన్నారు.

# మన ఊరు, మన బడి

సిద్ధవటం, జూన్ 11 ప్రభాతవార్త

మన ఊరు మనబడి, శుభ్రత పరిశుభ్రతపై, మన ఊరి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో, పారిశుద్ధం, ముళ్ళ పొదలు తొలగింపు చూపెట్టారు మండలంలోని మాధవరం, 1 వెంకటేశ్వరపురం జిల్లా పరిషత్ హై స్కూల్ ప్రాంగణంలో గురువారం శుభ్రత పరిశుభ్రత పాటించి అపరిశుభ్రతను పూర్తిగా తొలగించారు. ఈ సందర్భంగా మన ఊరి, స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ అవ్వారు రవిశంకర్ మాట్లాడుతూ స్కూల్ పరిసర ప్రాంతాల్లో ఉన్న అపరిశుభ్రత ముళ్ళ చెట్లు తొలగింపు చేపట్టామని పిల్లల తల్లిదండ్రుల ఆకాంక్ష మేరకు తొలగింపు చేపట్టామని మా సంస్థ ద్వారా ఎంతో మంది నిరుపేదలకు అండగా నిలబడుతూ వారి కుటుంబాలకు సహాయ కార్యక్రమాలు అందిస్తున్నామని పాఠశాలలు పరిశుభ్రంగా ఉంటే విద్యార్థులు ఆరోగ్యవంతులుగా ఉంటారని మన ఊరు, మనబడి అనే కార్యక్రమంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు స్కూల్ చైర్మన్ బండి ఓబులేసు మాట్లాడుతూ మన ఊరి స్వచ్ఛంద సేవ సంస్థ ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం హర్షించదగ్గ విషయమని పిల్లల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మన ఊరి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు, సుధీర్, ఉప్పల రామకృష్ణ, చంగయ్య, సుబ్బరాయుడు, స్కూల్ కమిటీ చైర్మన్ బండి ఓబులేసు, పిల్లల తల్లిదండ్రులు, సుబ్బారావు, కుమార్, ఆనంద్, సుబ్బలక్ష్మమ్మ, సుబ్బరత్న, వంట ఏజెన్సీ, సభ్యులు, జానపాటి కృష్ణయ్య, సామల రాజి, సిరివల్లి, తదితరులు పాల్గొన్నారు.



## 14న తొగట వీర క్షత్రియ
# విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



కడప కార్పొరేషన్ జూన్ 11 ప్రభాతవార్త:

2025, 26 సంవత్సరం 10వ తరగతి పరీక్షా ఫలితాలలో మంచి మార్కులు సాధించిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం కడప నగర అధ్యక్షులు కశ్యా సుధాకర్, ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు వెల్లడించారు. కడప సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా గత 13 సంవత్సరాలుగా ప్రతిభా పురస్కారాలను ప్రధానం చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరానికి కూడా 14న ఆదివారం ఉ. 10 గం.లకు కడప ప్రెస్ క్లబ్ లో విద్యార్థులకు నగదు, ప్రశంసా పత్రాలు, మెడల్స్ బహుకరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భారతీయ రైల్వేస్ నాగ్ పూర్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ గాలి శ్రీనివాసులు హాజరవుతారన్నారు. ఈ సమావేశంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమ్మడిశెట్టి సుబ్రహ్మణ్యం, కోశాధికారి టేకూరు సుదర్శన్, కార్యనిర్వాహక కార్యదర్శి పల్లా మురళీ కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు చౌడం సూరిబాబు, గౌరవాధ్యక్షులు పల్లా బాలచౌడన్న, సుంకర రామచంద్రుడు, బొలిశెట్టి వెంకటస్వామి, కాల్వ వాగేష్ టేకూరు పుష్పాంగద, దొండ్ల వెంకటరమణ, బండారు శ్రీనివాసులు పాల్గొన్నారు.

## ఆర్.ఎం.పి, ప్రైవేట్ వైద్యుల గుర్తింపు,
# చికిత్స విధానాల తనిఖీ



ఒంటిమిట్ట జూన్.11 ప్రభాతవార్త

కడప జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఆర్ఎంపి, ప్రైవేట్ వైద్యుల గుర్తింపు, చికిత్స విధానాలపై గురువారం వైద్యాధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉన్నతస్థాయి వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఒంటిమిట్ట మండలంలో పిహెచ్సి పరిధిలో ఉన్న ఆర్ఎంపి, ప్రైవేట్ వైద్యశాలల గుర్తింపు, వైద్యుల చికిత్స విధానాలను ఒంటిమిట్ట మెడికల్ డాక్టర్ భావన తనిఖీలు చేపట్టారు. ముందుగా ఆమె ఆర్ఎంపి, ప్రైవేటు వైద్యశాలల గుర్తింపు, చికిత్స విధానాలను స్వయంగా పరిశీలించారు. వైద్యశాలల గుర్తింపు కచ్చితంగా ఉండాలన్నారు. ఆరోగ్యపరంగా వైద్యశాలకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన చికిత్సలు అందాలన్నారు. ఆరోగ్య విధివిధానాలపై వైద్యులకు సలహాలు, సూచనలు అందించారు. తనిఖీల అనంతరం జిల్లాస్థాయి ఆరోగ్య అధికారులకు నివేదికలు పంపించడం జరిగింది. ఈ తనిఖీలలో వైద్యశాల సూపర్వైజర్లు సుజాత ,భాస్కర్ రెడ్డి, మగ ఆరోగ్య కార్యకర్త వెంకటసుబ్బయ్య, స్త్రీ ఆరోగ్య కార్యకర్త నాగభూషణమ్మ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## అధిక ఫీజులు వసూలు చేస్తున్న
# ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

బద్వేల్, జూన్ 11, ప్రభాతవార్త

విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు విద్యాసంస్థలతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు పాఠశాలలను నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకోవాలని రివల్యూషనరీ యూత్ అసోసియేషన్ రాష్ట్ర కోకన్వీనర్ ఎస్. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం బద్వేల్ పట్టణంలోని భగత్సింగ్ నగర్లో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బద్వేల్ నియోజకవర్గంలో విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు కుమ్మక్కై విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్నారని ఆరోపించారు. ప్రతి ప్రైవేటు విద్యాసంస్థలో 25 శాతం సీట్లను ఉచితంగా కేటాయించాలనే నిబంధన, ఫీజుల వివరాలను బహిరంగంగా ప్రదర్శించాలనే నిబంధనలను చాలా పాఠశాలలు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. అదనపు పుస్తకాలు, ఐడీ కార్డులు, మెస్, స్టడీ మెటీరియల్ తదితరాల పేరుతో తల్లిదండ్రులపై అధిక ఆర్థిక భారం మోపుతున్నారని విమర్శించారు. అలాగే బద్వేల్, పోరుమామిళ్ల ప్రాంతాల్లో కొందరు ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రైవేటు విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నప్పటికీ విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఈ పరిస్థితి అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తోందని వ్యాఖ్యానించారు. ఉన్నత విద్యావంతులైన నిరుద్యోగ ఉపాధ్యాయులకు అవకాశాలు కల్పించకుండా తక్కువ అర్హతలు కలిగిన వారిని నియమించుకుని స్వల్ప వేతనాలు చెల్లిస్తున్నారని, ఫిట్నెస్ లేని పాఠశాల బస్సులను నడుపుతూ విద్యార్థుల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని ఆరోపించారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలపై, ప్రభుత్వ ఉద్యోగులుగా ఉంటూ ప్రైవేటు పాఠశాలలను నిర్వహిస్తున్న ఉపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆర్వైఏ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ నెలాఖరులోపు కలసపాడు, కాశినాయన, పోరుమామిళ్ల, గోపవరం, అట్లూరు, బద్వేల్ ప్రాంతాల్లో ప్రైవేటు విద్యాసంస్థలను నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుల వివరాలను సేకరించి జిల్లా కలెక్టర్తో పాటు ఉన్నత విద్యాశాఖ అధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో యువజన సంఘం నాయకులు సీహెచ్. నారాయణ, ఈశ్వర్, వెంగమ రాజు, సలీం, రాము, బి. నారాయణ, నరసింహ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## క్రీడాస్ఫూర్తికి వేదికగా
# జేఎంఆర్ మెగా క్రికెట్ టోర్నమెంట్



నందలూరు, జూన్ 11 ప్రభాతవార్త:

యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో అరవపల్లి క్రీడా మైదానంలో జేఎంఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంట్ గురువారం ఘనంగా ప్రారంభమైంది. రాజంపేట నియోజకవర్గ ఇన్చార్జి చమర్తి జగన్మోహన్ రాజు తనయులు యువనేత చమర్తి లోకేష్ రాజు ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు కేవలం వినోదానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, నాయకత్వ లక్షణాల పెంపుకు దోహదపడతాయని పేర్కొన్నారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబరిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, వాటిని సమాన దృష్టితో స్వీకరించే క్రీడాస్ఫూర్తి ప్రతి క్రీడాకారుడిలో ఉండాలన్నారు. టోర్నమెంట్ ప్రారంభం అనంతరం లోకేష్ రాజు క్రీడాకారుల తో కలిసి క్రికెట్ ఆడి వారిలో ఉత్సాహాన్ని నింపారు. యువతతో మమేకమై వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు పసువులేటి ప్రవీణ్ కుమార్, రేవూరి వేణు గోపాల్, చుక్క యానాది, ఇరువురి మురళి, జేఎంఆర్ యూత్ సభ్యులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, యువజన ప్రతినిధులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

# నేడు వైకాపా కార్యకర్తల ర్యాలీ

దువ్వూరు, జూన్ 11, ప్రభాతవార్త:

దువ్వూరు మండలంలోని వైకాపా కార్యకర్తలు, పార్టీ కార్యకర్తలు నేడు మైదుకూరులో జరిగే వైకాపా కార్యకర్తల ర్యాలీలో పాల్గొనాలని దువ్వూరు వైకాపా మండల కన్వీనర్ ఇరగంరెడ్డి శంకర్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో ఇప్పటికీ హామీలు నెరవేర్చకపోవడంతో అలాగే ప్రజలకు వెన్నుపోటు పొడవడంతోను ఈ ర్యాలీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఎస్. రఘురామి రెడ్డి ఆధ్వర్యంలో ప్రొద్దుటూరు రోడ్డు నుండి ర్యాలీ ప్రారంభమవుతుందని మండలంలోని వైకాపా నాయకులు, మాజీ సర్పంచులు, జడ్పిటిసిలు, ఎంపీటీసీలు పాల్గొని వెన్నుపోటు ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

# మోడీ పాలన మేడిపండు చందం... మోడీది అస్థిర ప్రభుత్వం

వేంపల్లె జూన్ 11 ప్రభాతవార్త

'మేడిపండు చూడ మేలిమై ఉండు, పొట్ట విప్పి చూడ పురుగులుండు" అన్నట్లు మోడీ 12 ఏళ్ల పాలన మేడిపండు చందమని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. గురువారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ నరేంద్ర మోడీ 12 ఏళ్ల పాలనలో అటు దేశం,యిటు రాష్ట్రము అన్ని రంగాలలో నష్టపోయాయి. భారతదేశము వ్యవసాయ ప్రధానమైన దేశం. వ్యవసాయం గిట్టుబాటు కాక రైతులు అప్పుల ఊబి లో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నిరుద్యోగం వెలయతాండవం చేస్తోంది. పెట్రోలు,డీజలు,వంట గ్యాస్,కమర్షియల్ గ్యాస్, సిఎన్జి,ఎరువులు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. సామాన్యునికి అందుబాటులో లేవు. ఐటి, సిబిఐ, ఈడి, ఎన్నికల కమిషన్ తదితర రాజ్యాంగ వ్యవస్థలు నిర్వీర్యం అయిపోయాయి. మోడీ 12 సంవత్సరాల కాలంలో కేంద్ర ప్రభుత్వము 155 లక్షల కోట్ల రూపాయలు అప్పుచేసి దేశాన్ని అప్పుల భారత్గా మార్చింది. గత ప్రభుత్వాలు సంపాదించి పెట్టిన ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం అనేకం అమ్మకానికి పెట్టింది. రాష్ట్రానికి సంజీవని లాంటి ప్రత్యేక హోదా అమలు కాలేదు. ఒక్క మాటల్లో చెప్పాలంటే మోడీ పాలనలో ఏపీకి టోపీ పెట్టడం జరిగింది అని తులసి రెడ్డి విరుచుకుపడ్డారు.

**మోడీది అస్థిర ప్రభుత్వం.**

తనది సుస్థిర ప్రభుత్వమని మోడీ చెప్పుకోవడం హాస్యాస్పదం. లోక్ సభలో మొత్తం సీట్లు 543. అందులో మ్యాజిక్ సంఖ్య 272.గత సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి కి వచ్చిన సీట్లు 240 మాత్రమే.కాబట్టి ప్రస్తుతం నరేంద్ర మోడీ ప్రభుత్వం అస్థిర ప్రభుత్వం.కాంగ్రెస్ పాలనలోనే దేశంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. నెహ్రూ పాలనలో 1952 ఎన్నికల్లో 364 ఎంపీ సీట్లు, 1957లో 371 ఎంపీ సీట్లు, 1962లో 361 ఎంపీ సీట్లు గెలిచి సుస్థిర ప్రభుత్వాలు ఏర్పాటు చేయడం జరిగింది . అదేవిధంగా ఇందిరమ్మ పాలనలో 1967 లో 283, 1971లో 352, 1980లో 353 సీట్లు గెలిచి సుస్థిర ప్రభుత్వాలను ఏర్పాటు చేయడం జరిగింది. రాజీవ్ గాంధీ పాలనలో 414 ఎంపీ సీట్లతో సుస్థిర ప్రభుత్వాన్ని అందించడం జరిగింది. నెహ్రూతో మోడీని పోల్చడం అవివేకం పండిట్ నెహ్రూ దేశ తొలి ప్రధానిగా 16 సంవత్సరాల 286 రోజులు దేశానికి సేవ అందించారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం ఆత్మస్తుతి, పరనంద మానుకొని,సొంత డబ్బా వాయించుకోవడం మానుకొని, నిర్మాణాత్మక కార్యక్రమాలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని తులసి రెడ్డి సూచించారు.మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కదిరి ప్రసాద్ గౌడ, మల్లెం విజయభాస్కర్, అమర్నాథ్ రెడ్డి,ఉత్తన్న తదితరులు పాల్గొన్నారు.



# ఆర్ఎంపి క్లినిక్లు తనిఖీ..

బ్రహ్మంగారిమఠం జూన్ 11 ప్రభాతవార్త

మండల కేంద్రంలో పలు ఆర్ఎంపి క్లినిక్లను గురువారం బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డిఎంఅండ్హెచ్ఓ డాక్టర్ మల్లేష్ తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. ఆర్ఎంపీ క్లినిక్ లను పరిశీలించి, ప్రభుత్వం అందించిన చెక్లిస్ట్ ప్రకారం మానిటరింగ్ చేస్తున్నామని అందులో భాగంగానే ముందుగా వనిపెంటలో తనిఖీ చేశామని,ఇప్పటివరకు 12 క్లినిక్లను పరిశీలించామని, ప్రభుత్వం చెప్పినట్లుగా ఆర్ఎంపీలు పేరుకు ముందు డాక్టర్ అని పెట్టుకోవద్దని,అలాగే నేమ్ బోర్డు కు కూడా ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే పెట్టుకోవాలని ఆర్ఎంపీలకు సూచించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బి.మఠం మెడికల్ ఆఫీసర్ సంపత్ కుమార్,హెల్త్ అసిస్టెంట్ మాధవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



# ఎల్లటూరు సబ్స్టేషన్లో పీటీఆర్ సామర్థ్య పెంపు

## - విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పెండ్లిమర్రి, జూన్ 11, ప్రభాతవార్త:

ఎల్లటూరు సబ్స్టేషన్లో ఉన్న పవర్ ట్రాన్స్ఫార్మర్ (పీటీఆర్) సామర్థ్యాన్ని 5 ఎంవీఏ నుంచి 8 ఎంవీఏకి పెంచే పనులు చేపట్టనుండడంతో ఎల్లటూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ తువ్వ ఫీడర్, 11 కేవీ పెండ్లిమర్రి రూరల్ ఫీడర్, 11 కకేవీ రేపల్లి ఫీడర్, 11 కేవీ ఎల్లటూరు రూరల్ ఫీడర్ విద్యుత్తు వినియోగదారులకు అసిస్టెంట్ ఇంజినీరు తెలిపారు. ఈ పనుల కారణంగా ఈ నెల 12, 13 తేదీల్లో వ్యవసాయ విద్యుత్తు సరఫరా ఉదయం 4 నుంచి అందించబడుతుందన్నారు. అలాగే పనులు కొనసాగుతున్న సమయంలో పగటి వేళల్లో ఆయా ప్రాంతాల్లో తాత్కాలిక విద్యుత్తు సరఫరా అంతరాయాలు సంభవించే అవకాశం ఉన్నందున వినియోగదారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని విద్యుత్తు శాఖకు సహకరించాల్సిందిగా కోరారు.

# కూటమి పాలనకు రెండేళ్లుకు ర్యాలీ

వేంపల్లె జూన్ 11 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ కార్యక్రమాన్ని పులివెందుల టిడిపి ఆఫీస్ నందు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ చర్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జనసేన నాయకుడు పోతిరెడ్డి చలపతి మరియు బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. సుష్మ,మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పరిపాలన దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పాలన కొనసాగుతోందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు కూటమి విజయ ప్రస్థానం మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. అనంతరం పరస్పరం అభినందనలు తెలియజేసుకొని విజయోత్సాహాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# విద్యతోనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యం

## ఎం.ఆర్.పి.ఎస్ అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ కోట దానియల్ మాదిగ

పీలేరు జూన్ 11 ప్రభాతవార్త:

మే 25 నుండి మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు టార్గెట్ 40 రోజులు, గో.. టూ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఎంఆర్పిఎస్ వాల్మీకిపురం మండల అధ్యక్షులు గంత బాలకృష్ణ, మండల ఇన్చార్జి సీనియర్ నాయకులు సంగీతం రవీశ్వరయ్య, మధు ఆధ్వర్యంలో వాల్మీకిపురం మండలంలో నిర్వహించిన గో టు విలేజ్ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఆర్పిఎస్, ఎం.ఎస్.పి అన్నమయ్య జిల్లా ఇన్చార్జి కోట దానియల్ మాదిగ, ఎం ఆర్ పి ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వై రవీంద్ర మాదిగ లు హాజరైనారు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు అనంతరం వాల్మీకిపురం గ్రామ పంచాయతీ పత్తేపురం గ్రామంలో సీనియర్ నాయకులు ఉప్పు చింతల నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామ సభకు ప్రజలు ప్రత్యేక ప్రతిభావంతుడైన తిమ్మయ్య కుటుంబాన్ని పరామర్శించారు ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఇన్చార్జి కోట దానియల్ మాదిగ సొంత నిధులతో ప్రత్యేక ప్రతిభావంతుడైన తిమ్మయ్య అతని భార్య మాలతికి బట్టలు వారి పిల్లలకు చదువుకునేందుకు నోట్బుక్ లు పెన్నులు విద్యా సామాగ్రిని ఉచితంగా అందజేశారు ఈ సందర్భంగా దానియల్ మాదిగ మాట్లాడుతూ తిమ్మయ్య ఆరోగ్యం సరిలేక వికలాంగుడై మంచానికే పరిమితమై వారి కుటుంబం చాలా దీనావస్థ స్థితిలో ఉండడం చాలా బాధాకరమైన విషయమని ఈ కుటుంబాన్ని నేను దత్తత తీసుకుని వారికి ఏ అవసరం వచ్చిన ముందుండి ఆదుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామంలో చదువుకున్న విద్యార్థిని విద్యార్థుల, మౌలిక వసతులు సమస్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎం.ఆర్.పి.ఎస్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు వై రవీంద్ర మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం చాలా గర్వకారణమని అవర్గీకరణ ఫలాలు ప్రతి ఒక్క కుటుంబానికి అందాలంటే గ్రామాల్లో అన్ని కుటుంబాలలో ఉండే యువతీ యువకులు బాగా చదువుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలని అభివృద్ధి చెందాలంటే విద్య ఒకటే ఆయుధమని యువత చెడు మార్గంలో నడవకుండా విద్యకే ప్రాముఖ్యత నివ్వాలన్నారు. మండలంలోని ఎం ఆర్ పి ఎస్ జండా దిమ్మెలు లేని గ్రామాల్లో జులై ఏడో తేదీ నాటికి అన్ని గ్రామాల్లో జెండా దిమ్మెలు ఏర్పాటు చేయాలని తెలియజేశారు అనంతరం వాల్మీకిపురం మండలంలోని ఎంపీడీవో మనోహర్ రాజు ను కలిసి మండల పరిధిలోని ఎస్సీ గ్రామాల్లో మౌలిక పరిస్థితులైన త్రాగునీరు విద్యుత్ దీపాలు మురికినీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి సారించాలని తెలియజేశారు ఆయన సానుకూలంగా స్పందిస్తూ త్రాగనీరుపై వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించేందుకు సంబంధిత పంచాయతీ సెక్రటరీలతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇవే కాకుండా దళిత గ్రామాల్లో మౌలిక వసతులు పై ప్రత్యేక దృష్టి పెట్టి ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంఆర్పిఎస్ నాయకులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పీలేరు నియోజకవర్గం ఎం ఆర్ పి ఎస్, ఎం ఎస్ పి ఇన్చార్జి గండికోట వెంకటేష్, కో ఇన్చార్జిలు ముల్లంగి రెడ్డప్ప, అమరాల వెంకటరమణ, విద్యార్థులు మంజునాథ, హేమావతి, రెడ్డి మోహిత్, వెంకటరమణ, ఉమా తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో శారీరక మానసిక ఉల్లాసం

**టిడిపి యువనేత, చమర్తి లోకేష్ రాజు**



**సిద్దవటం, జూన్ 11 (ప్రభాతవార్త)**

క్రీడారంగం పట్ల యువత ఆసక్తి చూపాలని రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం క్రీడల పట్ల ఆసక్తి చూపుతుందని చమర్తి తనయుడు, లోకేష్ రాజు పేర్కొన్నారు మండలంలోని పార్వతీపురం గ్రామం లోని ప్లే గ్రౌండ్ లో గురువారం క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలల్లో ఆడుదాం ఆంధ్ర అంటూ యువతను మోసం చేసిందని రాష్ట్రంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం యువతకు క్రీడారంగంలో పట్ల అన్ని రకాలుగా ప్రోత్సాహిస్తుందని పేర్కొన్నారు 26 టీములుగా ఏర్పడి మొదటి రోజున సిద్దవటం, మాచుపల్లి గ్రామాలకు చెందిన క్రికెట్ ప్లేయర్స్ ఎంతో ఆసక్తిగా ఆడుతున్నారని గెలుపొందిన విజేతలకు జూన్ మాసంలో వివరిన బహుమతులు అందిస్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట జడ్పిటిసి ముద్దు కృష్ణారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు రాజశేఖర్, క్లస్టర్ ఇంచార్జ్ దారపునేని రాజా నాయుడు రాష్ట్ర వాణిజ్య అధికారిక ప్రతినిధి గంజి సుబ్బరాయుడు పార్లమెంట్ ఉపాధ్యక్షులు నాగ ముని రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి, వీరనాల రామచంద్రయ్య టిడిపి మండల మాజీ కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి, అసెంబ్లీ తెలుగు యువత అధ్యక్షులు నాగభూషణం, పార్ల శ్రీనివాసులు తదితర మండల టిడిపి కార్యకర్తలు క్రీడాకారులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ అధికారుల కర్తవ్యం : తహసిల్దార్

**పీలేరు జూన్ 11 ప్రభాతవార్త:**

ప్రజా సమస్యల పరిష్కారమే అధికారుల కర్తవ్యం తహసిల్దార్ శివకుమార్ అన్నారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ వివిధ రకాల సమస్యలతో మారుమూల ప్రాంతాల నుండి తమకున్న సమస్యలపై అవగాహన లేకపోయినా అధికారులకు సమర్పించే అర్జీలపై ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించడమే ప్రభుత్వ అధికారుల కర్తవమని తహసిల్దార్ శివకుమార్ అన్నారు. జిల్లా పరిధిలో ఉన్నతాధికారులకు సమర్పించే అర్జీలను తొలిదశగా పరిష్కరించేదుకు చొరవ చూపటమే కాకుండా ఆ గ్రామ బృందం వీఆర్వోలు సర్వేర్లు మండల శాఖ అధికారులతో బృందంగా ఏర్పడి రైతు పొలంలోకి నేరుగా వెళ్ళడమే కాకుండా నిజానిజాలను రాబట్టి అసలైన జీవితాన్ని గుర్తించి అన్యాయం జరిగింటే న్యాయం చేసేందుకు వెనుకాడబోనని అదేవిధంగా తప్పుడు సమాచారాలు అందిస్తే అలాగే శిక్షలు కూడా ఉంటాయని తాసిల్దార్ హెచ్చరించారు గ్రామస్థాయి అధికారులు కూడా అదే విధంగా రైతు సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. ప్రతి సోమవారం ఇచ్చే అర్జీలపై వచ్చే సోమవారం లోపల పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చొరవ చూపి పరిష్కరిస్తున్నామని ఆయన అన్నారు అలాగే గురువారం తలుపుల గ్రామంలో 14 92 సర్వే నెంబర్ల భూ



పొలంలో రైతులతో మాట్లాడుతున్న తహసిల్దారు శివకుమార్

విధాన్ని పరిష్కరించేందుకు భూ సమస్యలపై మండల సర్వే విలేజ్ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు బృందంతో కలిసి రైతు భూములను పరిశీలించి న్యాయం చేస్తామని భరోసా కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ రెడ్డి శేఖర్, విలేజ్ రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, రి సర్వేయర్ ఆల్ ప్రియ తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు గ్రామ రైతులుపాల్గొన్నారు.

## వడ్డెర సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**ఎమ్మెల్యే షాజహాన్‌బాషా**



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సంఘం నాయకులు

**మదనపల్లె, జూన్ 11 (ప్రభాతవార్త):**

వడ్డెర సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో వడ్డెరుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ భవన నిర్మాణాలకు వడ్డెరులు ఎంతో కృషి చేస్తున్నారని వీరి అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. వడ్డెరులకు ప్రత్యేక కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం మంజూరు చేయిస్తానన్నారు. కూటమి ప్రభుత్వం బిసిలకు అధిక ప్రాధాన్యత ఇస్తొందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలుగుదేశం ప్రభుత్వం బిసిల సంక్షేమానికి అనేక పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం ఎమ్మెల్యే వడ్డెర సంక్షేమ సంఘం నాయకులను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో వడ్డెరసంఘం నాయకులు మేస్త్రి, డ్యాన్స్ రెడ్డప్ప, డైరెక్టర్ చల్లా నరసింహులు, బండి ఆనంద్, రెడ్డప్ప, మేస్త్రీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల అభివృద్ధికి కూటమికి ఒక్క అవకాశం ఇవ్వండి

**రెండేళ్ల పాలనలో సంక్షేమం, అభివృద్ధి సాధించాం**

**బైక్ ర్యాలీ విజయవంతం చేసిన కార్యకర్తలకు కృతజ్ఞతలు**

**టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి బీటెక్ రవి**

**పులివెందుల, జూన్ 11 , ప్రభాతవార్త :**

కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్ల పూర్తయిన సందర్భంగా పులివెందులలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేసిన తెలుగుదేశం పార్టీ, బీజేపీ నాయకులు, జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులకు పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) కృతజ్ఞతలు తెలిపారు. టిడిపి కార్యాలయం వద్ద నుంచి పూలంగల సర్కిల్ వరకు అశేష జనవాహినితో కలిపి బైక్ ర్యాలీగా విచ్చేసి అనంతరం ఆయన మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా విజయోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, ప్రతిపక్షాలు దీనిని "వెన్నుపోటు దినం"గా అభివర్ణించడం బాధాకరమని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో పోలిస్తే కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పెన్షన్ల విషయంలో గత ప్రభుత్వం ఐదేళ్లలో రూ.2,000 నుంచి రూ.3,000కు మాత్రమే పెంచగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.4,000కు పెంచిందని గుర్తుచేశారు. అలాగే "అమ్మఒడి" పథకానికి గతంలో అనేక పరిమితులు ఉండేవని, ప్రస్తుతం "తల్లికి వందనం" పథకం ద్వారా ఒకే కుటుంబంలో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సూపర్ సిక్స్ హామీల అమలులో భాగంగా మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, "దీపం" పథకం కింద ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తున్నామని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తామని పేర్కొన్నారు. పులివెందుల అభివృద్ధిపై మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్, వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణ అభివృద్ధి ఆశించిన స్థాయిలో జరగలేదని ఆరోపించారు. ఔటర్



మీడియాతో మాట్లాడుతున్న బీటెక్ రవి

రింగ్ రోడ్డు, బస్టాండ్ ప్రాంత అభివృద్ధి, బోటింగ్ ప్రాజెక్టుల పేరిట ప్రజాధనం వృథా చేశారని విమర్శించారు. అసంపూర్తిగా నిలిచిపోయిన గ్రామీణ అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత రెండేళ్లలో పులివెందులలో వ్యాపారులు, సాధారణ ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవిస్తున్నారని, చట్టంశాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం విజయవంతమైందన్నారు. డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు సమర్థంగా పనిచేస్తున్నారని, రాజకీయ హత్యలు, ఫ్యాక్షన్ గొడవలకు తావులేకుండా పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. కేంద్రం, రాష్ట్రంలో ఒకే కూటమి ప్రభుత్వం ఉండటంతో అభివృద్ధి పనులకు మరింత వేగం వస్తోందని, రానున్న మున్సిపల్ ఎన్నికల్లో కూటమికి అవకాశం ఇస్తే పులివెందులకు మరిన్ని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులపై బీటెక్ రవి పలు విమర్శలు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో గత ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ, ఈసారి ప్రజలు మార్పును కోరుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మెరుగైన కిడ్నీ మార్పిడి వైద్య సేవలు

**డా. దిలీప్ ఎం బాబు..**




**కడప కార్పొరేషన్ జూన్ 11 ప్రభాతవార్త:**

ప్రస్తుత కాలంలో అన్ని వయసుల వారిని కిడ్నీ వ్యాధులు వేధిస్తున్న నేపథ్యంలో రోగులకు నూతన టెక్నాలజీ ఉపయోగించి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని యశోద హాస్పిటల్స్ సీనియర్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ మార్పిడి నిపుణులు దిలీప్ ఎం. బాబు తెలిపారు. బ్లడ్ మ్యాచ్ కాని వారికి కూడా కొత్త టెక్నాలజీ ద్వారా కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ చేస్తామని వెల్లడించారు. ఏడాది వరకు పేషంట్ తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తర్వాత నార్మల్ అవుతుందని భరోసా ఇచ్చారు. కడపలోని యశోద మెడికల్ సెంటర్ నందు పత్రికల సమావేశంలో డా. దిలీప్ ఎం. బాబు మాట్లాడారు. ప్రతి నెల రెండవ గురువారం కడప, ప్రొద్దుటూరులో శ్రీ సాయి డయాగ్నొస్టిక్ సెంటర్ నందు రోగులు సంప్రదించవచ్చునని తెలిపారు. లైవ్ డోనర్, కాడవరిక్, ఏబీఓ అననుకూల కిడ్నీ మార్పిడి వంటి అత్యాధునిక సేవలను యశోద హాస్పిటల్స్ అందిస్తోంది. చివరి దశ కిడ్నీ వ్యాధి ఉన్నవారికి డయాలసిస్ కంటే కిడ్నీ మార్పిడి ఉత్తమ చికిత్స అని, ఇది రోగుల జీవన ప్రమాణాలను, ఆయుష్షును గణనీయంగా మెరుగు పరుస్తుందని తెలిపారు. క్లిష్టమైన, ప్రమాదకరమైన కేసులతో సహా సుమారు 500 కిడ్నీ మార్పిడిలు చేసినట్లు వెల్లడించారు.

## విజయోత్సవ ర్యాలీకీ టిడిపి శ్రేణులు

**రెండేళ్ల పాలనలో అభివృద్ధి, సంక్షేమం**



**వేంపల్లె జూన్ 11 ప్రభాతవార్త**

టిడిపి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ బిటెక్ రవి నేతృత్వంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీకీ టిడిపి నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్ మాంగే) ఆధ్వర్యంలో వేంపల్లె నుంచి పెద్ద ఎత్తున శ్రేణులు తరలివెళ్లారు. ఆ ర్యాలీలో పాల్గొని జయప్రదం చేశారు. దాదాపు 110 మోటార్ బైకులతో ఉత్సాహంగా పాల్గొన్నారు. గడిచిన రెండేళ్ల టిడిపి కూటమి పాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తూ ఏపి సిఎం చంద్రబాబు రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్నారని టిడిపి నేత దేవర్ల చంద్రశేఖర్ రెడ్డి(దిల్ మాంగే) వెల్లడించారు. ప్రజా సంక్షేమానికి ప్రథమ ప్రాధాన్యత కల్పిస్తూ, నియోజకవర్గ అభివృద్ధిలో ఇంచార్జీ బిటెక్ రవి నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు.

## చికిత్స కేంద్రాలు, ప్రైవేట్ ఆసుపత్రుల తనిఖీ

**బద్వేల్ అర్బన్, జూన్ 11, ప్రభాతవార్త**

బద్వేల్, మున్సిపాలిటీ పరిధిలోని పలు ప్రథమ చికిత్స కేంద్రాలు మరియు ప్రైవేట్ ఆసుపత్రులను వైద్యాధికారులు గురువారం తనిఖీ చేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ డిప్యూటీ జిల్లా వైద్యాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించారు. నందిపల్లె, చింతలచెరువు ప్రాంతాల్లో ఉన్న శ్రీ లక్ష్మీ, వెంకట సుధ, శశి, అమీర్, రమణయ్య ప్రథమ చికిత్స కేంద్రాలతో పాటు బద్వేల్ పట్టణంలోని గోపాలకృష్ణ ఆసుపత్రిని తొట్టిగారిపల్లె వైద్యాధికారులు డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ శశివర్ధన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్యాధికారులు మాట్లాడుతూ, ప్రథమ చికిత్స కేంద్రాలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని, అనంతరం రోగులను ప్రభుత్వ ఆసుపత్రులకు లేదా ఉన్నత వైద్య కేంద్రాలకు తరలించాలని సూచించారు. సూదులు వేయడం, సెలైన్ ఎక్కించడం, షుగర్ మరియు రక్త పరీక్షలు నిర్వహించడం, గ్యాస్ చికిత్సలు అందించడం, అధిక శక్తి గల యాంటీబయాటిక్ మందులు వినియోగించడం వంటి చర్యలు చేపట్టరాదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించినట్లయితే సంబంధిత కేంద్రాలపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని సీజ్ చేసే అవకాశం ఉందని స్పష్టం చేశారు. అలాగే ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా సంబంధిత శాఖలో నమోదు చేసుకోవాలని సూచించారు. గోపాలకృష్ణ ఆసుపత్రిని తనిఖీ చేసిన అధికారులు, ఆసుపత్రి నిర్వాహకుడు డాక్టర్ గోపాలకృష్ణయ్య నుంచి అవసరమైన వివరాలను సేకరించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేటర్ బి. వెంగయ్య, హెల్త్ అసిస్టెంట్లు వీరి జనార్దన్ రావు, శ్రీరామయ్య పాల్గొన్నారు.



రికార్డుల పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

## సిఎంఓ ఫిర్యాదులపై కడప ఆర్డీఓ విచారణ



**సిద్దవటం జూన్ 11 ప్రభాతవార్త**

మండలంలోని జ్యోతి గొల్లపల్లి గ్రామానికి చెందిన కొండవీటి సింహం అనే వ్యక్తి సిఎంఓకు చేసిన ఫిర్యాదులపై కడప ఆర్డీఓ మురళి గురువారం విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ జ్యోతి గొల్లపల్లిలో సర్వే నెంబర్ 78 లోని రికార్డ్ పరంగా వాగు ఉందన్నారు. సదరు వాగు భూమిలో కంప చెట్లు ఉండడంతో నీరు వెళ్లేందుకు ఆస్కారం లేక పొలాల్లోకి నీరు చొరబడుతున్నాయని కంప చెట్లను తొలగించి నీరు వెళ్లేందుకు మార్గం చూపాలని సిఎంకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు సంబందిత ఇరిగేషన్ శాఖ అధికారులు సమస్య పరిష్కారానికి సంబందించిన నివేదిక ఇవ్వాలని సూచించామన్నారు. సర్వే నెంబర్ 24 లో పొలాల్లో రైతులో సర్దుకోవడం రస్తా సమస్య తలెత్తిందనే ఫిర్యాదుపై ఆర్డీఓ పరిశీలించి సంబందిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, తహసీల్దార్ విజయ్ కుమార్ లు నివేదిక సమర్పించాలని సూచించామన్నారు. ఆయా సమస్యపై అధికారులు ఇచ్చిన నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పించి సమస్యను పరిష్కరించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ సుధాకర్ బాబు, రెవిన్యూ ఇన్స్పెక్టర్ ప్రసాద్, విఆర్ఓ ప్రభాకర్ రెడ్డి, విలేజ్ సర్వేయర్ ఉదయ్, ఇరిగేషన్, పంచాయతీ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధమ చికిత్స కేంద్రాలు తనిఖీ



**దువ్వూరు, జూన్ 11, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని చింతకుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రథమ చికిత్స కేంద్రాలను అలాగే ఆర్ఎంపీ క్లినిక్ లను డాక్టర్ షేక్ రోషిణి గురువారం తనిఖీ చేశారు. చింతకుంట పరిధిలోని గుడిపాడు, చల్లబసాయి పల్లె, చింతకుంట గ్రామాలలో ఉన్న ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ చేసి వారికి పలు సూచనలు చేశారు. ప్రథమ చికిత్స కేంద్రం బోర్డు మాత్రమే ఉండాలని, ఆర్ఎంపి పేరు కాని, డాక్టర్ పేరు కాని ఉండరాదన్నారు. కేవలం ఆర్ఎంపీలు ప్రాథమికంగా చికిత్సలు చేయాలని చిన్నపాటి రోగాలకు, గాయాలకు మాత్రమే చేయాలని అలాగే ఎవరైనా రోగులు జ్వరం, దగ్గు, జలుబుతో వస్తే సాధారణ సమస్యలకు మందులు అందజేయాలన్నారు. చికిత్స కేంద్రాలలో యాంటీ బయోటిక్, ఖరీదైన మందులు వాడరాదు అన్నారు. గుండె, కిడ్నీ సమస్యలు వచ్చిన వారు ఎవరైనా వస్తే వారికి ప్రత్యేక వైద్య నిపుణుల వద్దకు పంపాలని తెలిపారు. నిబంధనలు పాటించకపోతే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాజగోపాల్, హరిచందన, సౌభాగ్య లక్ష్మి ‌ ‌ ‌ ్మ తదితరులు పాల్గొన్నారు.

## అభ్యుదయ రైతు మహాదేవ రెడ్డి ఉత్తమ రైతు అవార్డు స్వీకరణ

**మైదుకూరు, జూన్ 11, ప్రభాతవార్త:**

వైయస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం వెంకట రామన్న గూడెం తాడేపల్లి గూడెంలో నిర్వహించిన రైతు సదస్సులో మండలంలోని మిట్టమాను పల్లె చెందిన అభ్యుదయ రైతు ఉమ్మడి మహాదేవ రెడ్డి వైయస్సార్ కడప జిల్లా ఉత్తమ రైతు అవార్డు అందుకున్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ కె. ధనుంజయ రావు విస్తరణ సంచాలకులు డాక్టర్ రూత్ చేతుల మీదుగా వారు ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని స్వీకరించారు. ఉద్యాన రంగంలో నూతన పద్ధతులను అవలంబిస్తూ వ్యవసాయం, ఉద్యాన పంటలు, సాగు తో పాటు సమీకృత వ్యవసాయ విధాలైనటువంటి తేనెటీగల పెంపకం, పట్టు పరిశ్రమ, పుట్టగొడుగుల పెంపకం, సన్న జీవాల పెంపకంలో విశేష ప్రతిభ





కనబరుస్తూ రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న మహాదేవరెడ్డి విశ్వవిద్యాలయం ఈ అవార్డు ఎంపిక చేసింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ వివిధ దిగుబడులు సాధించడమే కాకుండా రైతులకు మార్గదర్శకంగా సేవలందిస్తుందన ఆయనకు ఈ గౌరవం దక్కింది. ఈ సదస్సులో కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త మరియు అధిపతి డాక్టర్ ఎం బాలకృష్ణ శాస్త్రవేత్తలు మరియు రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా విజయోత్సవ బైక్ ర్యాలీ

**పులివెందుల, జూన్ 11 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఘన విజయం సాధించి రెండేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా పట్టణంలో కూటమి మహా విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి (బీటెక్ రవి) నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ, భారతీయ జనతా పార్టీ నాయకత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు టీడీపీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ఎత్తున సాగి పూలంగళ్ల సర్కిల్ వరకు చేరుకుంది. ర్యాలీలో కూటమి పక్షాల నాయకులు, నియోజకవర్గ మరియు మండల స్థాయి ఇంచార్జ్లు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల కమిటీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మండల జడ్పీటీసీ మారెడ్డి లతా రెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారథి రెడ్డి, హెచ్ఎల్‌సీ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంగల శశి భూషణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భాను ప్రకాష్, డాక్టర్ మారెడ్డి రామిరెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి, వేంపల్లి మండల కన్వీనర్ మునీరెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ మహబూబ్ బాషా, లింగాల మండల నాయకుడు దేవిరెడ్డి సంజీవరెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ తూగుట్ల మధుసూదన్ రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, నల్లగారి భాస్కర్ రెడ్డి, కాంబల్లి గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గట్టి భద్రతా చర్యలు చేపట్టిన సిఐ శంకర్ రెడ్డి..**

పులివెందుల పట్టణంలో జరుగుతున్న విజయోత్సవ బైక్ ర్యాలీకి ఎటువంటి ఆటంకాలు లేకుండా పులివెందుల అర్బన్ ఇంచార్జ్ సిఐ శంకర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బందితో కలిసి గట్టి నిఘా బందోబస్తు నిర్వహించారు.



బైక్ ర్యాలీ లో పాల్గొన్న జడ్పిటిసి సభ్యురాలు మారెడ్డి లతారెడ్డి

### విద్యార్థుల భవిష్యత్తుకు

# బాటలు వేస్తున్న గిరిజన గురుకులం

**సుండుపల్లి, జూన్ 11, ప్రభాతవార్త:**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య సమగ్ర వ్యక్తిత్వ వికాసం అత్యంత పోటీ పరీక్షల విజయావకాశాలు కల్పిస్తూ రాష్ట్రంలో ఆదర్శ విద్యాసంస్థగా ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాలు సంస్థ నిరంతరం ముందంజలో ఉందని సుండుపల్లె గిరిజన గురుకుల బాలుర పాఠశాల కన్వీనర్ మరియు ప్రిన్సిపల్ వెంకటేశ్వర నాయుడు తెలియజేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గిరిజన అభివృద్ధి సంస్థలో భాగంగా ఏర్పాటైన ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయ సంస్థ అమరావతి నందు 199 విద్యాసంస్థలు ఉన్నాయనియు, ప్రఖ్యాతమైన విశ్వవిద్యాలయంలో నిర్వహించు పోటీ పరీక్షలకై ప్రత్యేకమైన శిక్షణ, ఆన్లైన్ క్లాసెస్ నిర్వహిస్తున్నారని తెలియజేశారు. 2025, 26 విద్యా సంవత్సరంలో ఎస్ఎస్సి ఫలితాలలో 79.68 శాతంతో గరిష్టంగా 591 మార్కులు సాధించగా 11 పాఠశాలలో 100శాతం ఉత్తీర్ సాధించారని అంతేకాకుండా ఇంటర్మీడియట్ నందు 93శాతం ఫలితాలు రాష్ట్ర ఉత్తీర్ణత 80శాతం కంటే ఎక్కువ ఫలితాలు సాధించారని తెలియజేశారు. 2020, 26 విద్యా సంవత్సరంలో 146 మంది విద్యార్థులు ఐఐటి జేఏఈ మెయిన్ సాధించగా 30 మంది ఐఐటి జేఈఈ అడ్వాన్స్‌కు ఎంపిక అయ్యారని తెలియజేశారు. ఇది గిరిజన విద్యార్థుల ప్రతిభకు గురుకులాల నాణ్యమైన శిక్షణకు నిదర్శనం అని క్రీడారంగంలో గురుకుల విద్యార్థులు సత్తా చాటుతున్నారని అలాగే అరకు కేంద్రంగా ప్రత్యేకంగా నిర్వహిస్తున్న విద్యార్థులకు ఉదయం మరియు రాత్రి వేళ యందు నిర్వహించు స్టడీ అవర్స్ నందు విద్యార్థులపై ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తూ ఉపాధ్యాయులు అందరూ అన్నివేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఉదయం యోగాతో పాటుగా ఆటల యందు ప్రత్యేకమైన శిక్షణ ఇచ్చుటకు వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలియజేశారు. ఉచిత విద్య వసతి పౌష్టికాహారం పరిశుభ్రమైన త్రాగునీరు ఆరోగ్య సంరక్షణ వంటి అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందించబడుతున్నాయని విద్యార్థులు ఆరోగ్య భద్రత కోసం ఏఎన్ఎంలు హౌస్ మాస్టర్లు వార్డెన్లు నిరంతరం అందుబాటులో ఉంటున్నారని గిరిజన సంక్షేమంతో పాటుగా క్రమశిక్షణ క్రీడలు వ్యక్తిత్వ వికాసం మరియు సమగ్ర అభివృద్ధికి అంకిత భావంతో పనిచేస్తూ నాణ్యమైన విద్యను అందించటలో ఆంధ్రప్రదేశ్ గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ రాష్టానికే గర్వకారణంగా నిలుస్తుందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు.



## బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరం

**సిద్దవటం జూన్ 11 ప్రభాతవార్త**

బాల్య వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సిద్దవటం ఎస్సై హారిక హెచ్చరించారు. సిద్దవటం మండలంలోని సంటిగారి పల్లిలో గురువారం రాత్రి గ్రామసభ నిర్వహించి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, బ్యాంక్ ఫ్రాడ్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చీటింగ్, ఫ్యాక్షన్, సోషల్ మీడియా దుర్వినియోగం వల్ల కలిగే నష్టాలు వివరించారు. శక్తిఖి యాప్ ను ఉపయోగించడం వల్ల పోలీసులు మహిళలకు కల్పించే రక్షణ గురించి వివరించారు. గ్రామాల్లో ప్రశాంతతను నెలకొల్పడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.



## మిద్దె మీద నుండి కింద పడి వ్యక్తి మృతి..

**రామాపురం జూన్11 ప్రభాతవార్త..**

మండలంలోని స్టేట్ బ్యాంక్ పక్కన బుధవారం మిద్దె మీద నుండి జారీ కిందపడి సూరం ఈశ్వర్ రెడ్డి అనే వ్యక్తి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని నల్లగుట్ట పల్లి గ్రామానికి చెందిన సూరం ఈశ్వర్ రెడ్డి స్థానిక హెచ్పి పెట్రోల్ బంక్ వద్ద పెంచర్ షాప్ నిర్వహిస్తూ రామాపురంలోనే జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరే బుధవారం రాత్రి భోజనం చేసి మిద్దె మీదక పడుకోవడానికి వెళుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకు వెళుతుండగా మృతి చెందాడు.

ఈశ్వర్ రెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లకిరెడ్డిపల్లి రోడ్డు ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలిపారు.

